http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 31 డిసెంబర్ 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



# ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాభివృద్ధి

## అధికారులు స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలి

## సీఎం రేవంత్ దిశానిర్దేశం

- హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలి
- నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలి
- రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నాం
- పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన
- జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదే

హైదరాబాద్

జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. ఇవాళ(మంగళవారం) కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని - మిగతా3లో



## బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా

# అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- ఏపీ నిర్మిస్తోన్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌కు సీడబ్ల్యూసీ అనుమతి వచ్చింది
- తెలంగాణ రాష్ట్ర అభిప్రాయం లేకుండా సీడబ్ల్యూసీ ఎలా అనుమతి ఇస్తోంది
- గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోంది
- ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుంది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉద్యమ ద్రోహి, జలదోపిడి ద్రోహి రేవంత్‌రెడ్డినే అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇవాళ(మంగళవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు హరీశ్‌రావు. ఏపీ నిర్మిస్తోన్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌కు సీడబ్ల్యూసీ అనుమతి వచ్చిందని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర అభిప్రాయం లేకుండా సీడబ్ల్యూసీ ఎలా అనుమతి ఇస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి - మిగతా3లో

## జర్నలిస్టులు ఎలాంటి

# అపోహలు పడొద్దు

- జర్నలిస్టు సంఘాలతో సమావేశమవుతానన్న మంత్రి పొంగులేటి..!
- ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన
- డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలి
- సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు
- డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి, జీవో 252 ని సవరించాలి
- జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

హైదరాబాద్

అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ - మిగతా3లో





## ఫేస్‌బుక్, వాట్సాప్‌లో కొత్తతరం ఏఐ ఏజెంట్స్

- సింగపూర్ స్టార్టప్‌ను సొంతం చేసుకున్న మెటా
- ఏఐ స్టార్టప్ మానుస్‌ను కొనుగోలు చేసిన టెక్ దిగ్గజం మెటా
- 2 బిలియన్ డాలర్లకు పైగా విలువైన డీల్ అని అంచనా
- గూగుల్, ఓపెన్‌ఏఐకి పోటీ ఇచ్చేందుకు మెటా వ్యూహాత్మక అడుగు
- తనంతట తానుగా పనిచేసే ఏఐ ఏజెంట్లను అభివృద్ధి చేసిన మానుస్
- ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ఈ టెక్నాలజీని విలీనం చేయనున్న మెటా
- మెటా వైస్ ప్రెసిడెంట్‌గా చేరనున్న మానుస్ సీఈఓ షావో హాంగ్

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను

# ఎండగట్టాలి

- బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ కీలక భేటీ..
- ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా ఉపయోగించుకోవాలి
- ప్రభుత్వం చెప్పే ప్రతీ అంశంపై సమాధానంతో సిద్ధంగా ఉండాలి
- ప్రధానంగా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి అసెంబ్లీ వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలన్నదే బీఆర్ఎస్ వ్యూహం




హైదరాబాద్

బీఆర్ఎస్ నేతలతో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. నందినగర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రులు కేటీఆర్ హరీష్ రావు పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రధానంగా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి అసెంబ్లీ వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలన్నదే బీఆర్ఎస్ వ్యూహం. ఇందులో భాగంగానే ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పాలమూరు - - మిగతా3లో



## మహిళలకు రక్షణ లేకుండా పోయింది’

- చొరబాట్లతో బెంగాల్ ప్రజల్లో ఆందోళన..
- మమతా ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన అమిత్ షా
- చొరబాట్లు ప్రజల్లో అభద్రతా భావాన్ని, ఆందోళనను సృష్టించాయి

# ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు



- ఈ సంక్రాంతికి టోల్ ప్లాజాల వద్ద ఫ్రీ వే!
- పండుగ రద్దీ ఉన్న రోజుల్లో లేన్‌లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దు.
- సంక్రాంతి ముంగిట హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు: మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు
- హైవేలపై సంక్రాంతి ట్రాఫిక్ నివారణకు ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష
- జనవరి 8 నుంచి హైదరాబాద్-విజయవాడ మార్గంలో భారీ రద్దీ అంచనా
- పండుగ వేళ హైవే లేన్‌లు మూసివేసే పనులు నిలిపివేయాలని ఆదేశం
- కీలక జంక్షన్లలో భారీగా ట్రాఫిక్ పోలీసుల మోహరింపు

హైదరాబాద్

గత అనుభవాల దృష్ట్యా ఈసారి పండుగ ప్రయాణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు, ఆర్ అండ్ బీ అధికారులకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో నేషనల్ హైవేలపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా ఉన్నారు. హైదరాబాద్ - విజయవాడ హైవే పై జనవరి 8వ తేదీ నుంచి వాహన రద్దీ ఎక్కువ ఉండొచ్చు. ప్రధానంగా ఎల్బీనగర్ నుండి వనస్థలిపురం, పనామా గోడౌన్, హయత్ నగర్, రామోజీ ఫిల్మ్ సిటీ ఈ ప్రాంతాల్లో వేలాది వాహనాలు రద్దీ ఏర్పడుతుంది..ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ ఆగడానికి వీల్లేదు. సంక్రాంతికి వెళ్ళే వారికి ఇబ్బంది లేకుండా - మిగతా3లో



## మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్

- గతంలో కంటే ప్రాణాంతకం!
- ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న ‘కాండిడా ఆరిస్’ ఫంగస్
- చికిత్స అందించినా 50 శాతానికి పైగా మరణాలు
- చర్మంపై ఎక్కువ కాలం ఉంటూ ఇతరులకు వ్యాప్తి
- సాధారణ ల్యాబ్ పరీక్షల్లో గుర్తించడం కష్టం

# ఫేస్‌బుక్, వాట్సాప్‌లో కొత్తతరం ఏఐ ఏజెంట్స్

టెక్నాలజీ రంగంలో మరో భారీ ఒప్పందం కుదిరింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ 'మానుస్'ను కొనుగోలు చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ డీల్ విలువ 2 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 16,600 కోట్లు) పైగానే ఉంటుందని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ కొనుగోలుతో ఏఐ రంగంలో గూగుల్, ఓపెన్‌ఏఐ వంటి సంస్థలకు గట్టి పోటీ ఇవ్వాలని మెటా లక్ష్యంగా పెట్టుకుంది. చైనాకు చెందిన వ్యవస్థాపకులు ప్రారంభించిన మానుస్, ప్రస్తుతం సింగపూర్ కేంద్రంగా పనిచేస్తోంది. ఇది సాధారణ ఏఐ చాట్‌బాట్‌ల లాంటిది కాదు. వినియోగదారుల సూచనలకు స్పందించడమే కాకుండా, తనంతట తానుగా క్లిష్టమైన పనులను పూర్తిచేసే "జనరల్ పర్పస్ అటానమస్ ఏఐ ఏజెంట్ల"ను అభివృద్ధి చేయడంలో ప్రసిద్ధి చెందింది. మార్కెట్ రీసెర్చ్, డేటా విశ్లేషణ, కోడింగ్, ట్రిప్ ప్లానింగ్ వంటి పనులను ఇది మానవ ప్రమేయం లేకుండానే చేయగలదు. ఈ అత్యాధునిక టెక్నాలజీని తమ ఉత్పత్తుల్లో విలీనం



చేయడమే లక్ష్యంగా ఈ కొనుగోలు జరిపినట్లు మెటా ఒక ప్రకటనలో తెలిపింది. "ఏఐ ఏజెంట్లు తదుపరి అతిపెద్ద టెక్నాలజీ మార్పును సూచిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ కేవలం సూచనలకు స్పందించడమే కాకుండా, వినియోగదారుల తరఫున పనులు కూడా చేస్తుంది. ఈ దిశగా మా దీర్ఘకాలిక వ్యూహానికి మానుస్ బృందం పనితీరు సరిగ్గా సరిపోతుంది" అని మెటా వివరించింది. భవిష్యత్తులో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలోని 'మెటా ఏఐ' అసిస్టెంట్‌లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తేనున్నారు. ఈ ఒప్పందంపై మానుస్ సీఈఓ షావో హాంగ్ కూడా స్పందించారు. "మెటాతో కలవడం మా పనికి దక్కిన గొప్ప గుర్తింపు. మానుస్ పనితీరులో ఎలాంటి మార్పు లేకుండా, మరింత బలమైన పునాదిపై భవిష్యత్తును నిర్మించుకుంటాం" అని ఆయన తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. ఈ డీల్ ప్రకారం, షావో హాంగ్ మెటాలో వైస్ ప్రెసిడెంట్‌గా చేరనున్నారు. 2022లో ప్రారంభమైన మానుస్, కేవలం 8 నెలల్లోనే 100 మిలియన్ డాలర్ల వార్షిక ఆదాయాన్ని సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. కొనుగోలు తర్వాత కూడా మానుస్ సేవలను ప్రత్యేకంగా కొనసాగిస్తామని, అదే సమయంలో తమ ప్లాట్‌ఫామ్‌లలో కూడా ఈ టెక్నాలజీని విలీనం చేస్తామని మెటా స్పష్టం చేసింది. వాట్సాప్ కొనుగోలు తర్వాత మెటా చరిత్రలో ఇది మూడో అతిపెద్ద డీల్‌గా నిలవడం గమనార్హం.

# ఆ ప్రాంతాల్లో గాలిపటం ఎగరేయొద్దు!

సంక్రాంతి పండుగ సీజన్ సంధర్భంగా ప్రజలకు దక్షిణమధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది. రైల్వే విద్యుత్ తీగలపై చిక్కి వేలాడుతున్న గాలిపటం దారాలను ఎట్టిపరిస్థితుల్లో తాకకూడదని ప్రజలను హెచ్చరించింది. రైల్వే ప్రాంగణాల పరిసరాల్లో, యార్డులు, ట్రాక్‌లు మరియు సమీపంలోని జనసంచార ప్రాంతాలలో గాలిపటాలు ఎగురవేయడం వల్ల విద్యుదాఘాతానికి గురైన సంఘటనలు ఇదివరకూ అనేకం జరిగాయని తెలిపింది. పతంగీలు ఎగరవేయడంపై జాగ్రత్తలను సూచిస్తూ ప్రకటన విడుదల చేసింది. గత సంక్రాంతి పండుగ సీజన్‌లో విద్యుధాఘాత ఘటనలు రైల్వేలోని అనేక జోన్‌లలో నమోదయ్యాయని తెలిపింది. కొంతమంది వ్యక్తులు 25 కె.వి ట్రాక్షన్ ఓవర్‌హెడ్ కండక్టర్‌లలో చిక్కుకున్న గాలిపటం దారాలను ముట్టుకోవడం ద్వారా విద్యుత్ షాక్‌లు తగిలి తీవ్ర గాయాల పాలయ్యారని పేర్కొంది. ప్రస్తుతం గాలి పతాలు ఎగరవేయడంలో ప్రజలంతా ప్రధానంగా చైనా మాంజా వాడుతున్నారని అది చాలా ప్రమాదకరమని తెలిపింది. ఆదారాలు విద్యుత్ వాహకం ( విద్యుత్‌ను సులభంగా గ్రహించేవి) అవడం వలన మానవ ప్రాణాలకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయని రైల్వేశాఖ తెలిపింది. అంతే కాకుండా రైల్వే విద్యుత్ మౌలిక సదుపాయాలకు తీవ్ర ముప్పును కలిగిస్తాయని పేర్కొంది. దీనివలన ప్రయాణీకులతో పాటు రైల్వే సిబ్బందికి, సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఇతర ప్రమాదాలకు దారి తీసే అవకాశాలున్నాయని తెలిపింది. కనుక ఈ




విషయంలో ప్రజలు రైల్వేశాఖకు పూర్తి సహకారం అందించాలని రైల్వే ట్రాక్‌లు, స్టేషన్లు, యార్డులు మరియు ఇతర రైల్వే సంస్థాపనల దగ్గర గాలిపటాలు ఎగురవేయకూడదని రైల్వేశాఖ ప్రకటన విడుదల చేసింది. ప్రతి ఒక్కరూ పండుగలను సంతోషంగా బాధ్యతాయుతంగా జరుపుకోవాలని రైలు కార్యకలాపాలను సజావుగా కొనసాగించడంలో సహాయపడాలని కోరింది.

# తమిళనాడు ప్రభుత్వానికి షాక్

తమిళనాడు ప్రభుత్వానికి బిగ్ షాక్ తగిలింది. స్టాలిన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన మద్రాస్ యూనివర్సిటీ సవరణ బిల్లును రాష్ట్రపతి భవన్ మంగళవారం వెనక్కి పంపించేసింది. మూడేళ్లుగా రాష్ట్రపతి వద్ద ఈ బిల్లు పెండింగ్‌లోనే ఉన్న సంగతి తెలిసిందే. మద్రాస్ యూనివర్సిటీ చట్టం 1923 ప్రకారం.. తమిళనాడు గవర్నర్ యూనివర్సిటీకి ఎక్స్-ఆఫీషియో చాన్సలర్. వైస్ చాన్సలర్ నియామకం, తొలగింపు తదితర హక్కులు గవర్నర్ వద్దే ఉన్నాయి. అయితే.. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవితో స్టాలిన్ సర్కార్‌కు పొసగడం లేదు. గవర్నర్ వల్లే తమిళనాడులో వర్సిటీల వీసీ నియామకాలు నిలిచిపోయాయని ప్రభుత్వం తరచూ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో మద్రాస్ వర్సిటీ బిల్లు ద్వారా గవర్నర్ అధికారాలకు చెక్ పెట్టాలని స్టాలిన్ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వైస్ చాన్సలర్‌ను నియమించుకునే అధికారం పొందడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలకు అనుగుణంగా యూనివర్సిటీ పాలనను మార్చడం, అలాగే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీని యూనివర్సిటీ సిండికేట్‌లో సభ్యుడిగా చేర్చడం తదితర అంశాలను బిల్లులో తమిళనాడు ప్రభుత్వం





పొందుపరిచింది. అయితే ఈ బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపగా.. మూడేళ్ల తర్వాత ఇప్పుడు రాష్ట్రపతి ముర్ము ఈ బిల్లును ఆమోదించకుండానే తిరిగి పంపించారు.

## ఇండోపాక్ సమరాన్ని ఆపా : నెతన్యాహూతో పేర్కొన్న ట్రంప్

**న్యూయార్క్:** ఇండోపాక్ వార్‌ను ఆపినట్లు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూతో జరిగిన మీటింగ్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు.



ఫ్లోరిడాలోని మార్ ఏ లాగో పామ్‌బీచ్‌లో ట్రంప్‌తో నెతన్యా భేటీ అయ్యారు. రెండోసారి వైట్‌హౌజ్‌లోకి ప్రవేశించిన తర్వాత ఇప్పటి వరకు 8 యుద్ధాలను నివారించినట్లు ట్రంప్ తెలిపారు. ఆర్మేనియా, అజర్‌బైజాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని, టారిఫ్‌లతో ఆ రెండు దేశాలను బెదిరించినట్లు చెప్పారు. కానీ తనకు అనుకున్నంత క్రెడిట్ దక్కలేదన్నారు. ఇండియా, పాకిస్థాన్ మధ్య ఫైటింగ్‌ను కూడా ఆపినట్లు ట్రంప్ వెల్లడించారు. అజర్‌బైజాన్ యుద్ధాన్ని ఆపిన తీరు పట్ల పుతిన్ కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినట్లు ట్రంప్ చెప్పారు. వాణిజ్యాన్ని నిలిపివేస్తానని అజర్‌బైజాన్‌ను బెదిరించామని, 200 శాతం టారిఫ్ విధిస్తామని చెప్పామన్నారు. దీంతో 35 ఏళ్ల ఫైటింగ్‌కు ఆ దేశం ఫుల్‌స్టాప్ పెట్టిందన్నారు. ఆ పని చేసినందుకు నాకేమీ క్రెడిట్ దక్కలేదని, అలాగే 8 యుద్ధాలను ఆపానన్నారు. ఇండియా, పాక్ వార్‌ను కూడా ఆపినట్లు ట్రంప్ చెప్పారు. ఇండోపాక్ సంక్షోభ అంశంపై ఇప్పటి వరకు సుమారు 70 సార్లు ట్రంప్ స్పందించినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్ తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు.

# మంచంపై పులిరాజా.. ఓ చేదు నిజం!

గ్రామంలోకి చొరబడిన ఓ పెద్దపులి.. జనాలను బెంబేలెత్తించింది. ఓ వ్యక్తిపై దాడి చేశాక.. ఆరుబయట ఉన్న మంచంపై తీరికగా సేద తీరింది. ఆ దృశ్యాన్ని కొందరు ఫోన్లలో బంధించడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే ఈ ఘటన వెనుక ఉన్న? చేదు నిజం గురించి చర్చ మాత్రం జరగడం లేదన్న అభిప్రాయం సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మధ్యప్రదేశ్ బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో గ్రామంలోకి చొరబడింది. అక్కడ ఆరుబయట సంచరిస్తుండగా దానిపై రాళ్లతో దాడి చేశారు. భయంభయంగానే అది దాక్కునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో అది అక్కడే కట్టేసిన ఉన్న పశువుల జోలికి పోలేదు (గ్రామస్తులు కూడా ఇదే విషయాన్ని చెప్పారు). అయితే రాళ్లు తగిలిన కోపంతో.. ఓ గ్రామస్తుడ్ని నేలకేసి కొట్టింది. ఆపై మరో ఇంట్లోకి వెళ్లి కొన్ని గంటలపాటు మంచంపై కూర్చుని సేదదీరింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది సుమారు 8 గంటలపాటు శ్రమించి పులిని బంధించారు. పులి బోనులోకి చేరడంతో పాటు గాయపడిన వ్యక్తికి కూడా ప్రాణాపాయం తప్పడంతో.. ఆ ఊరి ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. వేటగాళ్లకు భయపడే పులులు గ్రామాల్లోకి వస్తున్నాయని ఆ ఊరి ప్రజలు చెబుతుండడం ఇక్కడ చర్చించాల్సిన విషయం. టైగర్ స్టేట్‌గా పేరొందిన మధ్యప్రదేశ్‌లో పెద్దపులుల మరణాల లెక్కలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. తాజాగా.. సగర్ జిల్లాలోని ధానా ఫారెస్ట్ రేంజ్‌లో 10 ఏళ్ల ఆడ పులి మృతదేహం దొరికింది. గత వారం రోజుల్లో రాష్ట్రంలో ఆరు పులులు మృత్యువాత పడగా.. ఈ ఒక్క ఏడాదిలోనే 55 పులులు మరణించడం గమనార్హం. 1973లో మధ్యప్రదేశ్‌లో పులుల సంరక్షణ కోసం ప్రాజెక్ట్ టైగర్ ప్రారంభమైంది. అప్పటి నుంచి పులులు అత్యధికంగా చనిపోయింది ఈ ఏడాదిలోనే. అందునా అసహజ మరణాలే 11 నమోదు అయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. అయితే.. అటవీ శాఖ వీటిని ఎక్కువగా పులుల మధ్య గొడవలుగా పేర్కొంటున్నాయి. కానీ, క్షేత్ర పరిస్థితులు అవి కావనే చెబుతున్నాయి. వేట, కరెంట్ ఉచ్చులు.. పర్యవేక్షణ లోపాలు, నిర్లక్ష్యం ప్రధాన కారణాలని తెలుస్తోంది. ఓ జాతీయ మీడియా సంస్థ బయటపెట్టిన అటవీ శాఖ నివేదికలో.. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం, సరైన ఫోరెన్సిక్ పరిశీలన లేకపోవడం బయటపడ్డాయి. ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఉన్న వన్యప్రాణి అక్రమ రవాణా నెట్వర్క్ ప్రధాన సూత్రధారి యాంగ్‌చెన్ లఖుంపా ఇటీవలె సిక్కిం బార్డర్‌లో అరెస్టు అయ్యాడు. మధ్యప్రదేశ్‌లో పులులను చంపి.. వాటి చర్మం, గోళ్లు పళ్లు.. అక్రమ రవాణా చేసిన అభియోగాలు అతనిపై ఉన్నాయి. సంరక్షణవాదులు వ్యవస్థలోనే లోపాలు ఉన్నాయని, సంస్కరణలు లేకపోతే మరణాలు కొనసాగుతాయని హెచ్చరిస్తున్నారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం మాత్రం.. ప్రతి పులి మరణాన్ని సీరియస్‌గా తీసుకుంటామని, నిపుణుల బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని ఒక్క మాటతో తేల్చేస్తోంది.

## మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్



భారతీయ పరిశోధకుల నేతృత్వంలో జరిగిన ఓ తాజా అధ్యయనం ఆరోగ్య రంగంలో ఆందోళనకర విషయాలను వెల్లడించింది. డ్రగ్ రెసిస్టెంట్ (మందులకు లొంగని) ఫంగల్ జాతి 'కాండిడా ఆరిస్' ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని, ఇది గతంలో కంటే ప్రాణాంతకంగా మారుతోందని హెచ్చరించింది. ఢిల్లీలోని వల్లభ్‌భాయ్ పటేల్ చెస్ట్ ఇన్‌స్టిట్యూట్, అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. ఈ ప్రమాదకరమైన ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 65 లక్షల మందిపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు తెలిపారు. దీని తీవ్రత ఎంతలా ఉందంటే.. యాంటీ ఫంగల్ చికిత్స అందించినప్పటికీ మరణాల రేటు 50 శాతానికి పైగా ఉంటోందని పేర్కొన్నారు. ఇది బహుళ ఔషధాలను తట్టుకునే శక్తిని కలిగి ఉండటం వైద్యులను కలవరపెడుతోంది. కాండిడా ఆరిస్ మానవ చర్మంపై ఎక్కువ కాలం జీవించి ఉండగలదని, అక్కడి నుంచి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుందని నిపుణులు వివరించారు. ఇది ఈస్ట్ నుంచి ఫిలమెంట్‌గా రూపం మార్చుకోవడం, కణాల సమూహాలను ఏర్పరచుకోవడం వంటి కణ స్థాయి వ్యూహాలతో మనుగడ సాగిస్తోందని 'మైక్రోబయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ రివ్యూస్' జర్నల్‌లో ప్రచురితమైన నివేదిక పేర్కొంది. చర్మంపై, అలాగే నిర్జీవ ప్రదేశాలపై కూడా ఇది గమ్ లాగా అతుక్కుపోతుందని తెలిపారు. దీనివల్ల ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి ఇతరులకు ఈ ఫంగస్ సులభంగా వ్యాపించే ముప్పు ఉందని హెచ్చరించారు. మరోవైపు, సాధారణ ల్యాబ్ పరీక్షల్లో ఈ ఫంగస్‌ను గుర్తించడం కష్టమని, తరచుగా దీనిని వేరే ఈస్ట్‌గా పొరబడే అవకాశం ఉందని, దీనివల్ల చికిత్స ఆలస్యమవుతోందని పరిశోధకులు వివరించారు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కొత్త రకం యాంటీ ఫంగల్ మందులు, మెరుగైన వ్యాక్సిన్లు, అధునాతన డయాగ్నస్టిక్ పరీక్షలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు సూచించారు.

## మహిళలకు రక్షణ లేకుండా పోయింది'




పశ్చిమ బెంగాల్‌లోని మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. ప్రభుత్వం అవినీతి, భయం, చొరబాట్లతో బెంగాల్ నిండిపోయిందని.. ఇది రాష్ట్ర భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తోందని ఆరోపించారు. కోల్‌కతాలో విలేకరుల సమావేశంలో షా మాట్లాడుతూ.. 15 ఏండ్ల తృణమూల్ పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. 'గత 15 ఏండ్లుగా బెంగాల్ భయం, అవినీతి, దుష్పరిపాలనను చూసింది. చొరబాట్లు ప్రజల్లో అభద్రతా భావాన్ని, ఆందోళనను సృష్టించాయి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది' అని షా వ్యాఖ్యానించారు. దీదీ నేతృత్వంలోని ప్రభుత్వ అవినీతి కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బెంగాల్‌కు తిరిగి పూర్వవైభవం తెస్తామని.. స్వామి వివేకానంద, బంకిం చంద్ర చటోపాధ్యాయ, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్, శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఊహించిన బెంగాల్‌ను నిర్మించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## పుతిన్ ఇంటిపైదాడి... మోడీ ఆందోళన

**న్యూఢిల్లీ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసం లక్ష్యంగా జరిగిన డ్రోన్ దాడుల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలే యుద్ధాన్ని ముగించి, శాంతిని స్థాపించడానికి సరైన మార్గమని స్పష్టం చేశారు. పుతిన్ నివాసంపై దాడి జరిగిందన్న వార్తలు తనను కలచివేశాయని, ఇలాంటి సమయంలో శాంతి చర్చల ప్రక్రియకు విఘాతం కలిగించేలా ఏ పక్షం కూడా వ్యవహరించకూడదని మోదీ సూచించారు. అందరూ చర్చలపైనే దృష్టి సారించాలని ఆయన కోరారు.రాత్రి వేళ, పుతిన్ ఉంటున్న నొవొగొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ 91 లాంగ్ రేంజ్ డ్రోన్లతో విరుచుకుపడిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపించారు. దీనిని ఉగ్రవాద చర్యగా ఆయన అభివర్ణించారు. అయితే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు వాటన్నింటినీ కూల్చివేశాయని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని 'టాస్' వార్తా సంస్థ వెల్లడించింది. ఉక్రెయిన్ దాడికి రష్యా తగిన సమాధానం చెబుతుందని లావ్రోవ్ హెచ్చరించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఆదివారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడగా, ఫ్లోరిడాలోని తన నివాసంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో భేటీ అయ్యారు. ఈ చర్చలు చాలా సానుకూలంగా సాగాయని, యుద్ధం ముగింపు దశకు చాలా దగ్గరగా ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇలాంటి కీలక సమయంలో దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది.

## ప్రియాంక గాంధీ ఇంట మోగనున్న పెళ్లి బాజాలు.. స్నేహితురాలితో కుమారుడి ఎంగేజ్మెంట్

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ప్రియాంక, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. తన స్నేహితురాలు అవీవా బేగ్ తో రేహాన్ ఎంగేజ్మెంట్



జరిగినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. 25 ఏళ్ల రైహాన్ వాద్రాకు అవీవాతో ఏడేళ్లుగా పరిచయం ఉంది. వీరిద్దరూ మంచి స్నేహితులు. ఆ స్నేహం కాస్తా ప్రేమకు దారి తీసింది. ఈ క్రమంలో అవివా బేగ్‌కు రేహాన్ ప్రపోజ్ చేయగా.. ఆమె ఓకే చెప్పినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల అంగీకారంతో వీరిద్దరూ త్వరలో వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తోంది. వీరి ఎంగేజ్మెంట్ కూడా జరిపించినట్లు టాక్. అయితే, దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు. అవీవా ఢిల్లీకి చెందిన అమ్మాయిగా తెలుస్తోంది.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలి

-మొదటిపేజీ తరువాయి

రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని, ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టి కేవలం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాత్రమే నిర్మించిందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపణ. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో అటు కృష్ణా, ఇటు గోదావరి రెండు నదులపై చేపట్టిన ప్రాజెక్టులు, నీటి వాటాలు పరిష్కరించామని ఆ పార్టీ చెప్పుకొస్తోంది. ఇదే విషయంపై కొద్దిరోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం మధ్య మాటల యుద్ధం వ్యక్తిగత దూషణలకు దారి తీసింది. వీటన్నింటికీ అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ గట్టి పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగానే కాసేపటి క్రితమే కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు, ఇతర నాయకులు సమావేశమయ్యారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది?.. ప్రభుత్వం చెప్పే ప్రతీ అంశంపై సమాధానంతో సిద్ధంగా ఉండాలని ఇప్పటికే పార్టీ నేతలకు కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది.

## స్త్రీ నిధి పేరుతో యాప్

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మరింత వేగంగా, సులభతరంగా సేవలు అందించేందుకు టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకుంటోంది. ప్రజలు తమ మొబైల్ నుంచే అన్నీ సేవలు పొందేలా డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుంది. ఇటీవల మీ సేవకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మీ సేవ యాప్‌ను తీసుకురాగా.. దీని ద్వారానే ప్రజలు ఇన్ కమ్, కులం, రెసిడెన్షియల్ సర్టిఫికేట్ లాంటివి పొందవచ్చు. ఇక రేషన్ కార్డు వివరాలు, డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉందనేది తెలుసుకునేందుకు ఇటీవల టీ రేషన్ యాప్ ప్రారంభించింది. అలాగే రైతుల కోసం కొద్దిరోజుల క్రితం యూరియా బుక్ చేసుకునేందుకు యాప్ లాంచ్ చేయగా.. తాజాగా మహిళలకు ఉపయోగపడేలా కొత్త యాప్ తెచ్చింది. మహిళా పొదుపు సంఘాలకు ఆర్థికంగా తొడ్పాటు అందించేందుకు ప్రభుత్వం స్త్రీ నిధి పేరుతో రుణాలు మంజూరు చేస్తోన్న విషయం తెలిసిదే. ఈ రుణాలను సులువుగా పొందేలా మన స్త్రీనిధి పేరుతో యాప్ తీసుకొచ్చింది.

# గులాబీకి కలిసి రాని కాలం

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్, బీఆర్ఎస్ పేర్లు చెబితే పార్టీ క్యాడర్‌లో ఒక జోష్, ఉత్సాహం కనిపిస్తుంది. తెలంగాణ అభిమానుల్లో ఒక ఆవేశం తొణికిసలాడుతుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడిన తర్వాత రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన కేసీఆర్.. తిరుగులేని నాయకుడిగా గురి?తంపు తెచ్చుకున్నారు. అయితే 2023 ఎన్నికలనాటికి కేసీఆర్, అతని కుటుంబం అనుసరించిన విధానాలతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. దీంతో మూడోసారి గెలవాలన్న కేసీఆర్ ఆకాంక్ష నెలరవేరలేదు. దశాబ్దకాలం తిరుగులేని నేతగా ఉన్న కేసీఆర్ గ్రాఫ్ 2023 డిసెంబర్ తర్వాత నుంచి పడిపోతూ వస్తోంది. 2025లో అయితే ఇటు పార్టీ, అటు కుటుంబం, మరోవైపు అనారోగ్య సమస్యలు కేసీఆర్‌ను చుట్టుముట్టాయి. దీంతో దాదాపు ఏడాదికాలం ఆయన ప్రజలో?లకి రాలేదు. ప్రతిపక్ష నేతగా ఆశించిన ప్రభావం చూపలేదు. పార్టీలో కలహాలు, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు, సొంత పార్టీపైనే కూతురు ఆరోపణలు.. కేసీఆర్‌పై మరింత ఒత్తిడి పెంచాయి2025 కేసీఆర్‌కు పరీక్షల సంవత్సరంగా మారింది. పార్టీ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వీరిని అనర్హులుగా ప్రకటించాలని కేసీఆర్ పట్టుదలగా పోరాడుతున్నారు. సుప్రీం కోర్టు వరకు కూడా వెళ్లారు. అయితే కేసుల్లో వేగం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ. ఇక కేసీఆర్ కూతురు, ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్‌పై తిరుగుబాటు చేశారు. సొంత నేతలపైనే ఆరోపణలు చేశారు. దీంతో చివరకు కూతురును కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సిన పరిస్థితి కేసీఆర్‌కు వచ్చింది. అయితే కవిత పార్టీని వదిలి, తండ్రి పాలనపై దర్యాప్తు చేస్తానని షాక్ ఇచ్చారు. ఆమె లక్ష్యం వేరైనా, దెబ్బ తగిలేది కేసీఆర్‌కేబీఆర్ఎస్ కార్యకర్తల్లో కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆందోళనా గుసగుసలు ఎక్కువ. ఏడాదంతా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే పరిమితం కావడం అనుమానాలకు తావిచ్చింది. అవసర సమయంలో వైద్య పరీక్షలకు వస్తున్నారు. అక్కడి నుంచే పార్టీ ఆదేశాలు జారుతున్నాయి. కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగించినా, మేడిగడ్డ బ్యారేజ్, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో విచారణలు, ఫార్ములా-ఈ రేస్




ఆరోపణలు కుటుంబాన్ని చుట్టుముట్టాయి. ఈ ఒత్తిడులు ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని పార్టీలో అభిప్రాయం. 2025-26 బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ తొలిరోజు మాత్రమే కనిపించారు. కొద్ది నిమిషాల పాటే. తర్వాత అసెంబ్లీలో ముఖం చూపలేదు. తాజాగా శీతాకాల సమావేశాల తొలిరోజు మళ్లీ హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి నమస్కారం చేసిన ఆ సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కేవలం ఐదు నిమిషాలే అసెంబ్లీ హాల్‌లో ఉండి వెళ్లిపోయారు. హాజరు పడేందుకే కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నట్లు కనిపిస్తోంది.కేసీఆర్ పార్టీకే కాదు ప్రజలకూ దూరంగా ఉంటున్నారు. జల వివాదాల మధ్య నల్లగొండలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ భారీ పబ్లిక్ మీటింగ్ నిర్వహించారు. ఆ తర్వాత ప్రజల ముందు కనిపించలేదు. రెండేళ్ల తర్వాత ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో తన స్టైల్‌లో విమర్శలు గుప్పించారు. కానీ తర్వాత మళ్లీ సైలెంట్ అయ్యారు. దీంతో ప్రజల్లోనూ, పార్టీలోనూ కేసీఆర్ గ్రాఫ్ పడిపోతోంది. 2025 సంవత్సరం బీఆర్ఎస్ రెండు కీలక ఎన్నికలు ఎదుర్కొంది. జూబ్లీహిల్స్ బై-పోల్‌లో మాగుంట గోపీనాథ్ మరణంతో వచ్చిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ నిలబెట్టుకోలేదు. ఇక పంచాయతీ ఎన్నికల్లో మాత్రం మెరుగైన ప్రదర్శన కనబర్చింది. మొత్తంగా 2025 కేసీఆర్‌కు పరాజయాలే ఎక్కువగా ఎదురయ్యాయి.

# నిమ్స్ ఉద్యోగుల నిరీక్షణకు తెర

**హైదరాబాద్ :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఉద్యోగుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. వీరు కోరుతున్న విధంగా ఆర్జిత సెలవుల నగదు మార్పిడి సౌకర్యాన్ని కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో నం. 230 జారీ చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రత్యేక చొరవతో ఈ సమస్య పరిష్కారమైంది. ఎయిమ్స్ పే స్కేల్స్ పొందుతున్న రెగ్యులర్ సిబ్బందికి ఇకపై రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ సెలవులను సరెండర్ చేసి నగదు పొందే వీలుంటుంది. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రిలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన 'ఆర్జిత సెలవుల నగదు మార్పిడి' సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో.. ప్రభుత్వం దీనికి సంబంధించి కీలకమైన ఉత్తర్వులను (జీవో నంబర్ 230) విడుదల చేసింది. నిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎయిమ్స్ తరహాలో శాలరీలు అమలులో ఉన్నాయి. అయితే.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే 'సెలవుల నగదు మార్పిడి' సదుపాయం వీరికి గతంలో వర్తించేది కాదు. దీనివల్ల ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా వాడుకోకుండా మిగిలిపోయిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం ఉండేది కాదు. ఈ సమస్యను పరిష్కరించాలని నిమ్స్ ఉద్యోగ సంఘాలు.. ముఖ్యంగా నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు చాలా కాలంగా పోరాడుతున్నారు. ఇటీవల వారు మంత్రిని కలిసి విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించి అధికారులను సమన్వయం చేశారు. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. తెలంగాణ సెలవు నిబంధనలు-1933 ఇకపై నిమ్స్ ఉద్యోగులకు కూడా వర్తిస్తాయి. దీనివల్ల.. ఉద్యోగులు తమ ఖాతాలో ఉన్న ఆర్జిత సెలవులను ప్రభుత్వానికి అప్పగించి (సరెండర్ చేసి), దానికి



సమానమైన నగదును పొందే వీలుంటుంది. ఇది అత్యవసర సమయాల్లో లేదా పదవీ విరమణ సమయంలో వారికి పెద్ద ఆర్థిక ఆసరాగా మారుతుంది. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నిమ్స్ సిబ్బందికి కూడా ఈ హక్కు లభించడం వల్ల వారిలో వివక్ష తొలగిపోతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సేవలు అందించే నర్సులు.. పారామెడికల్, ఇతర సాంకేతిక సిబ్బందిలో ఈ నిర్ణయం నూతనోత్సాహాన్ని నింపుతుంది. ఆరోగ్య శాఖలో పనిచేసే సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల ఆసుపత్రుల పనితీరు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. నిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో పనిచేసే వారికి ఇలాంటి రాయితీలు ఇవ్వడం వల్ల వారు మరింత నిబద్ధతతో పనిచేస్తారని ఆరోగ్య శాఖ అధికారులు భావిస్తున్నారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు ఈ జీవోను జారీ చేస్తూ.. నిబంధనల అమలులో పారదర్శకత ఉండాలని సూచించారు. ఈ నిర్ణయం పట్ల నిమ్స్ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ దీర్ఘకాలిక సమస్యను అర్థం చేసుకుని.. తక్షణమే జీవో వచ్చేలా కృషి చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహాకు ఉద్యోగ సంఘాలు కృతజ్ఞతలు తెలుపుతున్నాయి. వేలాది మంది కుటుంబాలకు ఈ నిర్ణయం ద్వారా మేలు జరగనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ సానుకూల అడుగు ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారానికి కూడా దారి చూపుతుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## ఇక టోల్ ఫ్రీ ప్రయాణం

**నల్గొండ :** తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి ప్రయాణాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకోబోతోంది. పండుగ రోజుల్లో టోల్‌గేట్ల వద్ద వాహనాలు గంటల తరబడి నిలిచిపోకుండా ఉండేందుకు.. ఆ మూడు నాలుగు రోజుల పాటు టోల్ వసూళ్లను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్ణయించారు. దీనిపై చర్చించేందుకు మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. భాగ్యనగరం నుండి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే ప్రయాణికులకు టోల్ కష్టాలు తప్పవు. ముఖ్యంగా పంతంగి, కొర్లపహాడ్ చిల్లకల్లు వంటి టోల్ ప్లాజాల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతుంటాయి. ఫాస్టాగ్ సౌకర్యం ఉన్నప్పటికీ.. వాహనాల సంఖ్య లక్షల్లో ఉండటంతో ఒక్కో టోల్ ప్లాజా దాటడానికి గంటల సమయం పడుతోంది. పండుగకు వెళ్లే ఉత్సాహంలో ఉన్న సామాన్యులకు ఈ ట్రాఫిక్ జామ్‌లు నరకాన్ని చూపిస్తున్నాయి. చంటిపిల్లలు, వృద్ధులతో ప్రయాణించే వారు ఈ రద్దీలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు ఏటా కనిపిస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ జాతీయ రహదారిపై పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వివిధ చోట్ల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, వంతెనలు, సర్వీసు రోడ్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నిర్మాణ పనుల కారణంగా రహదారిపై ఇప్పటికే అనేక చోట్ల మళ్లింపులు ఉన్నాయి. సాధారణ రోజుల్లోనే వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా.. ఇక పండుగ రద్దీ తోడైతే ట్రాఫిక్ సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. టోల్ వసూళ్ల కోసం వాహనాలను ఆపితే.. ఆ రద్దీ వెనక్కి కిలోమీటర్ల మేర విస్తరించి హైవే అంతా స్తంభించిపోయే ప్రమాదం ఉంది.

## ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని మార్గనిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ వాహనాలను తీసుకురావాలని నిర్ణయించామని తెలిపారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి.
చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలని దిశానిర్దేశం చేశారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దు

-మొదటిపేజీ తరువాయి

కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది.

## ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు

-మొదటిపేజీ తరువాయి

అన్ని రకాల చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. పోయినసారి ఎదురైనా అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలి. రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుంది. కాబట్టి దీనిపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. పండుగ రద్దీ ఉన్న రోజుల్లో లేన్‌లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దు. అత్యవసరంగా చేయాల్సిన పనులు ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలి. పండుగ మొదలుకానున్న తేదీకి ముందే రోడ్లపై ఉన్న మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలు పూర్తిగా తొలగించాలి. అన్ని రహదారి లేన్‌లు వాహనాల రాకపోకలకు పూర్తిగా అందుబాటులో ఉంచాలి. పగలు, రాత్రి రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోట స్పష్టంగా కనిపించే ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. హై-విజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలి. ఎక్కడా ట్రాఫిక్‌కు అయోమయం కలిగించే ఏర్పాట్లు ఉండకూడదు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలి. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం పాటించాలి. అన్ని సంబంధిత శాఖలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలి. రోడ్డు పనుల్లో ఉన్న సిబ్బంది అందరూ ప్రతిబింబించే జాకెట్లు (పసుపు / నారింజ రంగు) తప్పనిసరిగా ధరించాలి.
రాత్రి సమయంలో జంక్షన్లు, వర్క్ జోన్‌ల వద్ద తగినంత వెలుతురు ఏర్పాటు చేయాలి. బారికేడ్లు, ట్రాఫిక్ ఐలాండ్‌లపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉపయోగించాలి. రూట్ పేట్రోల్ వాహనాలు, క్రేన్లు, అంబులెన్సులు 24 గంటలు అందుబాటులో ఉంచాలి. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలి. టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగకుండా సజావుగా వెళ్లేలా అదనపు బృందాలను మోహరించాలి. రేపు నేను తూప్రాన్ పేట్,అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తా అని తెలిపారాయన.

### కేంద్రానికి ఫ్రీ వే రిక్వెస్ట్

సంక్రాంతి పండుగ వేళ ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా టోల్ ప్లాజాల వద్ద ఫ్రీ వే ఏర్పాటుకు కేంద్రానికి రిక్వెస్ట్ చేస్తామని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. "పండుగ పూట లక్షలాది మంది ప్రయాణం చేస్తారు.. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలనేది మా ప్రభుత్వ ఆలోచన. ఈ అంశంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఇవాళ లేఖ రాస్తా. అవసరమైతే ఒకటి,రెండు రోజుల్లో నేను స్వయంగా వెళ్ళి కలుస్తా. జనవరిలో ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం జాతరకు వెళ్లే లక్షలాది భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరతా. టోల్ ప్లాజాల వద్ద ఫ్రీగా ఉంటే వాహనాలు ఆగవు..ఎలాంటి అసౌకర్యం ఉండదు" అని తెలిపారాయన. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు,నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి,సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,%చీనాా×% రీజినల్ అధికారి శివ శంకర్, %వీశీ=ు౧% రీజినల్ అధికారి కృష్ణ ప్రసాద్,డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీ,పలువురు పోలీస్ ఉన్నతాధికారులు,ఆర్ అండ్ బీ ఈఎన్సిలు జయభారతి, మోహన్ నాయక్, ఎస్.ఈ ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి



-మొదటిపేజీ తరువాయి

బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని ఆక్షేపించారు హరీశ్‌రావు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిసారి బీఆర్ఎస్ నాయకులను విమర్శించడమే సరిపోతోందని విమర్శించారు. నీటి వాటా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిద్ర పోతుందా.. నిద్ర పోతున్నట్లు నటిస్తుందా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తాను ఎటువంటి ఫేక్ రాజకీయాలు చేయడం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతో ఉన్న అనుబంధంతోనే తాను ఇలా మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు హరీశ్‌రావు. తెలంగాణ జలదోపిడికి సూత్రదారి ఆదిత్య నాథ్ దాస్ అని ఆరోపణలు చేశారు. తెలంగాణ ద్రోహి ఆయనేనని ఆక్షేపించారు. ఆదిత్య నాథ్ దాస్‌ను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఎంత ధైర్యమని నిలదీశారు. బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తే తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీ అనుమతి రద్దు చేయాలని ఢిల్లీలో ధర్నా చేద్దామని హరీశ్‌రావు సూచించారు.

# సంపాదకీయం

## డేటా కేంద్రాలు.. జనజీవనం అస్తవ్యస్తం!

'కృత్రిమ మేధ' విప్లవం భూగోళాన్ని వేగంగా కమ్ముకుంటోంది. దాన్ని బలోపేతం చేసేందుకు సాగుతున్న గ్లోబల్ పరుగులో అగ్రభాగాన నిలిచేందుకు ఇండియా చేస్తున్న ప్రయత్నంలో భాగంగా, అందుకవసరమైన భారీ డేటా సెంటర్ల నిర్మాణం కోసం రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే నీటి కొరతలో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాల్లో డేటా సెంటర్లు నెలకొల్పుతున్నారు. దీనివల్ల దేశంలో డిజిటల్ బూమ్‌కు సమాంతరంగా నీటి కరవు తాండవిస్తుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ డిజిటల్ వికాసం జనజీవన వినాశనానికి దారితీస్తోంది. ఆసియాలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన ఇండియా అంతర్జాతీయ డేటా సెంటర్ల ఏర్పాటుకు కూడలిగా మారబోతోంది. ఆ క్రమంలో రాష్ట్ర పాలకులు, ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చట్టాలు, నిబంధనలు పాటించని అనేక పరిశ్రమలను (రోగ్ ఇండిస్ట్రీస్) ప్రజల పన్నుల సొమ్ముతో అనేక రాయితీలు కల్పించి ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా జీవనాన్ని, ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ఫణంగా పెట్టి కార్పొరేట్ కేంద్రిత ఆర్థిక, ద్రవ్య విధానాలను కేంద్రం దన్నుతో అమలు చేస్తుండడం రాష్ట్ర ప్రజలకు శాపంగా పరిణమించనుంది. కాలుష్య కారక, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను కలిగించే ఘన, ద్రవ, వాయు వ్యర్థాలను యథేచ్ఛగా వెదజల్లే ఫ్యాక్టరీలకు విచ్చలవిడిగా అనేక రుణాలు, సబ్సిడీలు, మౌలిక వసతుల కల్పనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడమనే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. వాతావరణ ప్రతికూల ప్రభావాలను కల్గించే, ప్రాథమికంగా పెద్దఎత్తున విద్యుత్‌ను, నీటిని వినియోగిస్తూ, వేడిని, ఈ-వ్యర్థాలను వెదజల్లుతూ స్థానిక వనరులు ధ్వంసం చేసే, కర్బన ఉద్గారాలను అరాచకంగా వెదజల్లే.. నీటి కరువు, తీవ్ర శీతోష్ణస్థితి మార్పులు, మానసిక, శారీరక రుగ్మతలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే.. అత్యంత ప్రమాదకరమైన ఈ కేంద్రాల నిర్మాణం క్షమించరాని దారుణం. 2030 నాటికి 6 గిగావాట్ సామర్థ్యంగల డేటా సెంటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 7 డేటా సెంటర్లు రాష్ట్రంలో నడుస్తున్న వాటికి తోడుగా, వైజాగ్ కేంద్రంగా గూగుల్, రిలయన్స్, సిఫీ కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున డేటా కేంద్రాలను నిర్మాణం చేపట్టనున్నాయి. అదే విధంగా విజయవాడ సమీపంలోని ఐ.టి పార్క్‌లో 60 మెగా వాట్ల సామర్థ్యంగల డేటా సెంటర్లను 'పై డేటా సెంటర్స్' అనే సంస్థ ఒక హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ డేటా సెంటర్ల నిర్మాణం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, ఆర్థికాభివృద్ధిని తీసుకొస్తామని పాలకులు గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారు. ఇండియాలో డేటా సెంటర్ మార్కెట్ విజృంభిస్తోంది. 130-153 డేటా సెంటర్లు దేశవ్యాప్తంగా 31 ప్రాంతాల్లో విస్తరించడమే కాకుండా, రాబోయే కొన్ని సంవత్సరాల్లో ఆ సంఖ్య రెట్టింపు కావొచ్చుననే అంచనాలు జోరుగా సాగు తున్నాయి. మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఎన్.టి.టి గ్లోబల్ సెంటర్లు, టెలీ మీడియా గ్లోబల్, ఐరన్ మౌంటైన్, ఈక్వినాక్స్ అనే గ్లోబల్ డేటా సెంటర్ల ఆపరేటర్లు, కంట్రోల్ ఎస్, పై డేటా సెంటర్లు, బి.ఎస్.ఎన్.ఎల్ (నెక్స్ట్ జెనరేషన్ ఇన్‌ఫినైట్), వెబ్ వర్క్స్, ఎయిర్‌టెల్, అదానీ కనెక్స్, సిఫీ టెక్నాలజీలస్ అనే జాతీయ సంస్థలు డేటా సెంటర్లను నడుపుతున్నాయి. కొత్తగా గూగుల్ (అదానీ కనెక్స్ సహకారంతో), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, రిలయన్స్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు కొత్తగా భారీ డేటా సెంటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాయితీలతో అత్యంత ప్రమాదకర డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పోటీ పడుతున్న వాటిలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచేందుకు దారుణమైన రీతిలో ప్రజారోగ్యం, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థలను ఫణంగా పెడుతోంది. సంప్రదాయ డేటా సెంటర్ ఏడాదికి 10-25 మెగావాట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తే, ఎ.ఐ తో నడిచే డేటా సెంటర్ ఏడాదికి 100 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తుంది. ఇది ఒక లక్ష కుటుంబాలు ఏడాదికి వినియోగించే విద్యుత్‌కు సమానం. సర్వర్లు (60 శాతం), సమాచార నిల్వ వ్యవస్థలు (దాదాపు 5 శాతం), నెట్ వర్కింగ్ పరికరాల సంధానం (5 శాతం), ఐటీ పరికరాల వినియోగం (7-30 శాతం) విద్యుత్ వినియోగం పెద్ద ఎత్తున జరిగి స్థానిక విద్యుత్ వ్యవస్థకు పెద్ద అడ్డంకిగా మారుతుంది. విద్యుత్ వినియోగంలో అధిక భాగం ఉష్ణం (వేడి)గా మారుతుంది. దాంతో డేటా సెంటర్లను చల్లబరచవలసి ఉంటుంది. అందుకోసం చల్లగాలి జనరేటర్లను వాడుతున్నప్పటికీ, ప్రధానంగా ఆ ఉష్ణాన్ని నీటి ద్వారా తొలగించడం పరిపాటి. ఒక మెగావాట్ డేటా సెంటర్ కోసం ఏడాదికి 26 మిలియన్ల (రెండు కోట్ల అరవై లక్షల) లీటర్లను వినియోగించాల్సి వస్తుంది. 30 మెగావాట్ల డేటా సెంటర్ కోసం ఏడాదికి 780 మిలియన్ లీటర్ల (అంటే రోజుకు 2,19,700 లీటర్ల) నీటిని వినియోగించాలి. ఇండియాలో పట్టణ ప్రాంతాల్లో రోజుకు తలసరి 135 లీటర్ల నీరు అవసరం. అందువల్ల రోజుకు 1630 మందికి అవసరమయ్యే నీటిని ఖర్చు చేయవలసి వస్తుంది. గూగుల్ 1 గిగావాట్ (వెయ్యి మెగావాట్లు), రిలయన్స్ 1 గిగావాట్, సిఫీ-500 మెగావాట్లు, మెటా-500 మెగావాట్లు, పై-60 మెగావాట్లు లక్ష్యంగా డేటా సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 6 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్లు 2030 నాటికి రాబోతున్నాయి. అంటే, రోజుకు 4,39,40,000 లీటర్లకు పైగా నీటిని డేటా సెంటర్లు వినియోగించబోతున్నాయి. దాంతో డేటా సెంటర్లున్న ప్రాంతాలలో పెద్ద ఎత్తున తాగు/సాగు నీటి కొరత ఏర్పడి ప్రజా జీవనాన్ని అల్లకల్లోలంగా మార్చుతుంది. 2024లో గ్లోబల్ విద్యుత్ వినియోగంలో 1.5 శాతంగా ఉన్న డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం, గత ఐదేళ్లలో ఏడాదికి 12 శాతం చొప్పున పెరిగింది. అదే సమయంలో ఇప్పటికీ విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు వినియోగం 30 శాతం, గ్యాస్ 26 శాతం, అణు శక్తి 15 శాతంగా ఉంది. డేటా సెంటర్లు 27 శాతం విద్యుత్తును ఖర్చు చేస్తుండడంతో, అది మరింత వేగంగా పెరుగుతుండడం, ఇతర పారిశ్రామిక, ప్రజా అవసరాల కోసం గ్లోబల్ విద్యుదుత్పత్తిని పెంచక తప్పని పరిస్థితి. ఇప్పటికే శిలాజ ఇంధనాల నుంచి వెలువడుతున్న హరిత వాయువులను తగ్గించుకోలేని పరిస్థితి కొనసాగుతుండగా, ఈ డేటా సెంటర్ల వల్ల కర్బన ఉద్గారాలు మరింతగా పెరిగే దుస్థితి ఏర్పడుతుంది. పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించే లక్ష్యంతో వివిధ దేశాలు కార్బన్ క్రెడిట్ల లక్ష్యం కోసం అణు విద్యుత్‌పై ఆధారపడవలసిన పరిస్థితి. రాబోయే డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలను తీర్చే ఉద్దేశంతో పౌర అణ విద్యుత్ రంగంలోకి ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలను అనుమతించేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకొంది. లాభాల కోసం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు (భోపాల్ గ్యాస్ మారణహోమం ఉదంతం) ప్రాణాంతక అణు విద్యుత్ ఉత్పత్తి రక్షణ నియమాలను తుంగలోకి తొక్కి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అత్యధిక విద్యుత్ వినియోగం, భారీగా నీటి వినియోగం, పెద్దఎత్తున డేటా సెంటర్ పరిసరాల్లో ఉష్ణం వ్యాపించడం, ప్రమాదకరమైన ఈ వ్యర్థాలు అనూహ్యమైన స్థాయిలో ఉత్పత్తి కావడం, భరించలేని శబ్ద కాలుష్యం, పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తడం, ఉపాధి కల్పన పరిమితంగా వుండడంతో అమెరికాలో ప్రజలు డేటా సెంటర్ల నిర్మాణానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించారు. దానివల్ల దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో 64 బిలియన్ డాలర్లు పైగా మదుపుతో పెట్టబోయే డేటా సెంటర్ల నిర్మాణం రద్దయింది. అయితే ప్రజా ఉద్యమాల ధాటికి ఉత్పత్తి, ఖర్చును మించిన వ్యర్థాల పరిరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. దీంతో లాభాల మార్జిన్ల కోసం అలాంటి 'రోగ్' పరిశ్రమలను బహుళజాతి సంస్థలు దక్షిణాది వ్యవసాయ దేశాలకు, పేద దేశాలకు తరలిస్తాయి. వెనుకబడిన, వర్ధమాన దేశాల ప్రజలకు ఆయా సంస్థల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించిన సమాచారం కొరవడడం, ప్రభుత్వాలు, పాలక వర్గాలు వ్యర్థ నియంత్రణ వ్యవస్థల ఏర్పాటును పెద్దగా పట్టించుకోక పోవడం వంటివి ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితి కల్పిస్తుంది. ప్రజారోగ్యాన్ని, వ్యవసాయ-పారిశ్రామిక రంగాలను, పర్యావరణాన్ని ధ్వంసం చేసే డేటా సెంటర్లు, ఇథనాల్ ఫ్యాక్టరీలు, పెట్రో కెమికల్ రసాయనాల తయారీ, అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, సోలార్ ప్యానల్ తయారీ ఫ్యాక్టరీ తదితర 'రోగ్ ఫ్యాక్టరీ'ల ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను ప్రజలు సంఘటితంగా తిప్పికొట్టవలసిన తరుణమిది. తస్మాత్ జాగ్రత్త.

# సాంకేతిక యుగంలో ఆధ్యాత్మికత

మనిషి జీవితం కేవలం భౌతిక సౌకర్యాల సాధనకే పరిమితమైన యాంత్రిక ప్రయాణం కాదనే సత్యాన్ని గుర్తుచేసే దినమే వరల్డ్ స్పిరిట్యువల్ డే. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న ప్రపంచ వ్యాప్తంగా ఈ దినాన్ని ఆధ్యాత్మిక చైతన్య దినంగా గుర్తిస్తూ, అంతర్ముఖ పరిశీలనకు, మానవ విలువల పునరుద్ధరణకు పిలుపునిస్తారు. ఒక వైపు విజ్ఞానం, సాంకేతికత అద్భుతమైన వేగంతో ముందుకు సాగుతున్నా, మరోవైపు మనిషి అంతరంగంలో శాంతి కరువవు తుండటం, నైతిక విలువలు సడలి పోవడం, మానవ సంబంధాలు సంకుచిత మవడం వంటి పరిణామాలు తీవ్రంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యమే వరల్డ్ స్పిరిట్యువల్ డే ప్రాధాన్యతను మరింత పెంచుతోంది. ఆధ్యాత్మికత అనేది మతాచరణకే పరిమితమైన సంకుచిత భావన కాదు. అది మనసు, బుద్ధి, చైతన్యాల మధ్య సమన్వయ సాధన. స్వార్థాన్ని అధిగమించి విశాలమైన దృష్టితో జీవించటం, కరుణ, సహనం, సత్యం, అహింస, సేవ వంటి మానవీయ విలువ లను ఆచరణలో పెట్టడమే నిజమైన ఆధ్యాత్మికత. భగవద్గీతలో చెప్పిన కర్మయోగం, ఉపనిషత్తుల్లో ప్రతిపాదించిన ఆత్మజ్ఞానం, బుద్ధుని జ్ఞాన మార్గం, మహావీరుని అహింసా సిద్ధాంతయ ఇవన్నీ మనిషిని అంతర్ముఖంగా మలచే ఆధ్యాత్మిక మార్గాలే. ఇవి కాలాతీత సత్యాలుగా నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. నేటి ప్రపంచం యుద్ధాలు, ఉగ్రవాదం, హింస, సామాజిక అసమానతలు, పర్యావరణ సంక్షోభం, పెరుగుతున్న మానసిక ఒత్తిడులతో అల్లాడుతోంది. ఈ సమస్యలకు చట్టాలు, పాలసీలు, సాంకేతిక పరిష్కారాలు అవసరమే అయినా, అవి మాత్రమే సరిపోవు. అసలు మార్పు మనిషిలో రావాలి. ఆ మార్పుకు మూలం ఆధ్యాత్మిక చైతన్యమే. వ్యక్తి తనలో తాను మారితేనే సమాజం మారుతుందిబీ సమాజం మారితేనే ప్రపంచం మారుతుంది. ఈ భావనను ప్రపంచ వ్యాప్తంగా అనేక ఆధ్యాత్మిక సంస్థలు, ధ్యాన కేంద్రాలు, ఆశ్రమాలు వరల్డ్ స్పిరిట్యువల్ డే సందర్భంగా ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నాయి. ఆధ్యాత్మికత శాస్త్రానికి వ్యతిరేకమన్న అపోహను ఆధునిక పరిశోధనలు పూర్తిగా తొలగించాయి. ధ్యానం, యోగ, మైండ్‌ఫుల్‌నెస్ వంటి సాధనల వల్ల ఒత్తిడి తగ్గడం, ఏకాగ్రత పెరగడం, భావోద్వేగ సమతుల్యత మెరుగు పడడం వంటి ప్రయోజనాలను శాస్త్రం స్పష్టంగా నిరూపిస్తోంది. మానసిక ఆరోగ్యానికి ఆధ్యాత్మిక సాధనలు




ఎంతగానో దోహద పడుతున్నాయని వైద్య నిపుణులే చెబుతున్నారు. అంటే ఆధ్యాత్మికత శాస్త్రానికి విరుద్ధం కాదుబీ అది శాస్త్రాన్ని మరింత మానవీయంగా మలిచే శక్తిగా నిలుస్తోంది. భారతదేశం ఆధ్యాత్మిక వారసత్వానికి పుట్టినిల్లు. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, భక్తి ఉద్యమం, యోగ సంప్రదాయయిఇవన్నీ ప్రపంచానికి భారతదేశం అందించిన అపూర్వమైన ఆధ్యాత్మిక కానుకలు. "వసుధైవ కుటుంబకం" అనే విశ్వ మానవతా సిద్ధాంతం నేటి ప్రపంచానికి అత్యంత అవసరమైన మార్గదర్శక సూత్రం. జాతి, మతం, దేశ సరిహద్దులను దాటి మానవాళిని ఒక కుటుంబంగా చూడాలన్న ఈ దృష్టికోణం ప్రపంచ శాంతికి మూలాధారం. వరల్డ్ స్పిరిట్యువల్ డే సందర్భంలో భారతీయ ఆధ్యాత్మిక తత్త్వం ప్రపంచానికి మరింత అవసరమవు తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. యువత ఈ ఆధ్యాత్మిక చైతన్యంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. ఆధ్యాత్మికత అంటే విరక్తి లేదా లోకత్యాగం కాదని, బాధ్యతతో కూడిన జీవన విధానమని యువత గ్రహించాలి. ఆధ్యాత్మిక విలువలను అలవరచుకున్న యువత వ్యక్తిగత విజయాన్ని మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా సమర్థంగా నిర్వహించ గలరు. సేవా కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవ, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాటయ ఇవన్నీ ఆధ్యాత్మికతకు ఆచరణాత్మక రూపాలే. వరల్డ్ స్పిరిట్యువల్ డేను ధ్యానం, యోగ సాధన, మౌనాచరణ, సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సాహిత్య పఠనం, మతాతీత సంభాషణలు, శాంతి సందేశాల ప్రచారం వంటి కార్యక్రమాలతో జరుపుకోవచ్చు. ఇవన్నీ మనిషిని తనలో తాను పరిశీలించుకునేలా చేస్తాయి, కొత్త సంవత్సరాన్ని ఆత్మ పరిశుద్ధితో ఆహ్వానించేందుకు దోహద పడతాయి. మొత్తానికి వరల్డ్ స్పిరిట్యువల్ డే ఒక స్మరణ మాత్రమే కాదుఒక సంకల్పం. భౌతిక అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక పరిపక్వత సాధించినప్పుడే మానవజాతి నిజమైన పురోగతిని అందుకుంటుంది. వ్యక్తి అంతర్ముఖంగా శాంతిని పొందిన నాడే ప్రపంచం బాహ్యంగా శాంతిని పొందగలదు. ఆధ్యాత్మిక చైతన్యమే మానవాళి భవిష్యత్తుకు దీపశిఖగా నిలుస్తుంది.

# పరీక్షల సాగదీత.. విద్యార్థులకు శిక్ష

ఈ మధ్యకాలంలో 10వ తరగతి పరీక్ష విధానంలో జరుగుతున్న మార్పులు విద్యార్థులు, ఉపాధ్యాయులులేకాక విద్యావేత్తలలోనూ ఆందోళన కలిగిస్తున్నది. కరోనా కాలంలో పాఠశాల పనిదినాలు తక్కువగా ఉండటం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడం కోసం తాత్కాలికంగా పాఠ్యాంశాలు తగ్గిస్తూ 11 పేపర్లుగా ఉన్న పదవ తరగతి పరీక్షను ఆరు పేపర్లకి తగ్గించారు. ఈ మార్పు కరోనా కాలంలో సరైనదిగానే భావించిన తర్వాత కాలంలో పాఠ్యాంశాలు కుదింపు చేయకుండా 6 పేపర్ల విధానాన్ని కొనసాగించడం వల్ల విద్యార్థుల పై మానసిక ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం 7 పరీక్షలను 35 రోజుల సుదీర్ఘ కాలంపాటు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేయడంతో విదార్థుల్లో, ఉపాధ్యాయుల్లో మానసిక ఆందోళన మొదలైంది. ప్రస్తుతమున్న పాఠ్యపుస్తకాలు కరోనా కాలం కన్నా ముందున్న 11 పేపర్లలకు కనుగుణంగా రాయబడ్డాయి. కానీ కరోనా కాలంలో పరీక్షా విధానాన్ని ఆరుపేపర్లకు తాత్కాలికంగా తగ్గించిన తర్వాత పాఠ్యాంశాలు కుదించకుండా తగ్గించిన ఆరు పేపర్ల విధానాన్ని కొనసాగించడంతో విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో ఒత్తిడి పెరిగింది. ఉదా? సాంఘిక శాస్త్రంలో మొత్తం 21 పాఠ్యాంశాలు ఉన్నాయి. వాటికి రెండు పేపర్లతో పరీక్ష విధానం ఉండేది. విద్యార్థులు 1 నుంచి 11 పాఠ్యాంశాలకు మొదటి పేపర్, 12 నుంచి 21 పాఠ్యాంశాలకు రెండో పేపరు పరీక్ష రాసేవారు. ఇది హేతుబద్ధంగా, శాస్త్రీయంగా ఉండేది. అయితే ప్రస్తుతం 21 పాఠ్యాంశాలకు గాను ఒకే సాంఘిక శాస్త్ర పరీక్ష, అందులో 18 ప్రశ్నలు మాత్రమే ఉండడంతో కనీసం ఒక పాఠ్యాంశం నుంచి ఒక ప్రశ్న కూడా లేని విధంగా ప్రశ్నాపత్రం ఉండడంలో శాస్త్రీయత ఉందా? సాంఘిక శాస్త్ర మూల్యాంకనానికి ఒక పేపర్ ఉండాలన్నప్పుడు 21 పాఠ్యాంశాలలో కనీసం ఐదు పాఠ్యాంశాలైన తగ్గించాల్సి ఉండే. ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించాలని బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విడుదల చేసిన షెడ్యూలు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడం అటు ఉంచితే, మానసిక ఆందోళనను పెంచుతుంది. ఒక సబ్జెక్టులకు 4, 5 రోజుల విరామం కాకుండా ఒకటి, రెండు రోజుల విరామం ఉండాల్సింది. పరీక్షల షెడ్యూలు తయారు చేసే ముందు ఫీల్డ్‌లో అనుభవం ఉన్న ఉపాధ్యాయుల సలహాలు తీసుకొని ఉండాల్సింది. ఏకంగా 35 రోజులపాటు 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తే అన్ని రోజులు పాటు విద్యార్థులు పరీక్షపై దృష్టిని నిలిపి ఉంచలేరూ. ఇది విద్యార్థుల్లో ఒక రకమైన నిరుత్సాహాన్ని పెంచుతుంది. పరీక్షల మధ్య ఎక్కువ వ్యవధి ఉండడంతో, విద్యార్థులు బయట తిరగడం వల్ల అనారోగ్యానికి గురి అయితే, ఇది మొత్తంగా పరీక్షలపై తీవ్ర ప్రభాతం చూపే అవకాశం ఉంటుంది. సిబిఎస్ఇ విధానాన్ని బట్టి పదవ తరగతి షెడ్యూల్ తయారు చేసినట్లు తెలుస్తుంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని లోతుగా అధ్యయనం చేయాల్సి ఉండే. సిబి ఎస్‌సి పాఠ్యాంశాలు చదువుతున్న విద్యార్థుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు వేరు ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి, మోడల్ స్కూల్ లాంటి స్టేట్ సిలబస్ చదువుతున్న విద్యార్థుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు వేరు. సిబిఎస్ఇలో చదువుతున్న విద్యార్థుల్లో మెజారిటీగా అర్బన్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉంటారు. అందులో తల్లిదండ్రులు అక్షరాసులై ఉంటారు. అదే ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి, మోడల్ స్కూల్ తదితర సంస్థలలో చదివే విద్యార్థులు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలలో ఉంటారు. తల్లిదండ్రులలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉంటారు. 7 పరీక్షలకు 35 రోజుల టైమ్‌లో మధ్యలో విరామం ఎక్కువగా ఉండటం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు పనులకు వెళ్ళవలసి రావడంతో చదువుపై దృష్టి కేంద్రకరించలేరు. తల్లిదండ్రులు కూడా అన్ని రోజులు విద్యార్థులపట్ల శ్రద్ధ వహించలేరు, వారికి కావలసిన సౌకర్యాలు అందించలేరు. ఇది మొత్తంగా పరీక్ష ప్రిపరేషన్ విధానాన్నీ దెబ్బతిసే అవకాశం ఉంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి, మోడల్ స్కూల్ లాంటి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ నెల రోజులపాటు పదో తరగతి పరీక్షల్లో నిమగ్నమైతే హోం పరీక్షలపై ప్రభావం పడుతుంది. హోం పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నా, పరీక్షలను గుణాత్మకంగా నిర్వహించాలన్నా సబ్జెక్ట్ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలి. 35 రోజులపాటు 10వ తరగతి పరీక్షలు నిర్వహించిన వెంటనే మూల్యాంకనానికి సీనియర్ ఉపాధ్యాయులు వెళ్ళవలసి ఉంటుంది. ఇది 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులను హోం పరీక్షలకు తయారు చేయడంపై ప్రభావం చూపుతుంది. 10వ తరగతి విద్యార్థులను 6, 7, 8, 9, తరగతుల విద్యార్థులను ఒకేసారి పరీక్షలకు సంసిద్ధం చేయలేము. 35 రోజులు పదవ తరగతి విద్యార్థులపై దృష్టి సారించాల్సి రావడం వలన హోం పరీక్షలను నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంటుంది. సిబిఎస్‌సి పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల కంటే ముందు హోం పరీక్షలు నిర్వహించి, తర్వాత పదవ తరగతి పరీక్షలు నిర్వహించే వారు, ఈ నిర్వహణలో హేతుబద్ధత, శాస్త్రీయత ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదవ తరగతి పరీక్షలు రెండు దాఫాలుగా నిర్వహిస్తారు. మొదటి దశలో ఫిబ్రవరిలో నిర్వహించి మార్చి, ఏప్రిల్‌లో హోం పరీక్షల్లో నిర్వహిస్తారు. రెండవ దశ పరీక్షలు మే లో నిర్వహిస్తారు. ఈ విధానంలో కూడా హేతుబద్ధత, శాస్త్రీయత ఉంది. అయితే ఎస్ఎస్‌సి బోర్డు షెడ్యూలు ప్రకారం మార్చి 14 న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 16 వరకు సుమారు 35 రోజులు నిర్వహిస్తారు. అదే ఏప్రిల్‌లో హోమ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. రెండు పరీక్షలు ఒకేసారి నిర్వహించాలంటే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. 10వ తరగతి విద్యార్థులు 35 రోజుల పాటు పరీక్షలు రాస్తే రెసిడెన్షియల్ పాఠశాలలో హోం ఎగ్జామ్స్ రాసే విద్యార్థులపై ఆ ప్రభావం ఉంటుంది. నెల రోజులపాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడడం, వారికి పరీక్షలు సక్రమంగా నిర్వహించడం కత్తిమీద సామే అవుతుంది. సుదీర్ఘంగాఉన్న పరీక్షల ప్రస్థానం వల్ల తదుపరి పాలిటెక్నిక్ లాంటి కాంపిటీషన్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి సమయం ఉండకపోవచ్చు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు విద్యార్థులను కార్యోన్ముఖులను చేయలేగాని, కార్యహీనులను చేయరాదు. సంస్కరణలు ఫీల్డ్ స్థాయి సమస్యలను పరిష్కరించేదిగా ఉండాలి కానీ, సమస్యలు సృష్టించేదిగా ఉండకూడదు. సంస్కరణలు స్థానిక సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఉండాలే గాని మరో వ్యవస్థను అనుసరించినట్లుగా ఉండకూడదు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు అధిక భాగం గ్రామీణ ప్రాంత విద్యార్థులే కాబట్టి ప్రస్తుతం ప్రకటించిన 10వ తరగతి పరీక్షల షెడ్యూల్‌ను పునర్ సమీక్షించవలసిందిగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## దాతృత్వానికి ప్రతిరూపం బుడ్డా వెంగళరెడ్డి

కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తాలూకాలోని ఉయ్యాలవాడ గ్రామం ఇరువురు విశిష్ట వ్యక్తులకు జన్మ స్థలంగా నిలిచింది. బ్రిటిషు వారి నెదిరించి 1846లో ఉరికంబ మెక్కిన ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి ఒకరైతే, 1900 సంవత్సరంలో తుది శ్వాస వరకూ మూర్తీభవించిన దాతృత్వంగా పేరొందిన బుడ్డా వెంగళరెడ్డి మరొకరు. ఉయ్యాల వాడ నరసింహారెడ్డి బ్రిటీష్ వారితో పోరాడి పేరు తెచ్చుకుంటే, ప్రభు త్వంతో సఖ్యతగా మెలుగుతూనే ప్రజలకు సేవ చేశాడు అదే ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బుడ్డా వెంగళరెడ్డి. తన దాతృ త్వంలో అప్పటి బ్రిటీష్ రాణి క్వీన్ విక్టోరియానే ఆకట్టుకున్న వ్యక్తి బుడ్డా వెంగళరెడ్డి. ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని 'రేనాడు సూర్యుడు' అంటారు. బుడ్డ వెంగళ రెడ్డిని 'రేనాటి చంద్రుడు' అంటారు. సిపాయిల తిరుగుబాటుకు ముందే తెల్ల దొరల తలలు తెగిన అరివీర భయంకరుడు నరసింహారెడ్డి అయితే ఎముకలేని చేయి కలిగి అభినవ దానకర్ణుడు అని పేరెన్నికగన్నారు వెంగళ రెడ్డి. బుడ్డా వెంగళరెడ్డి (జనవరి 1, 1840 – డిసెంబరు 31, 1900) కర్నూలు జిల్లా, ఉయ్యాలవాడ గ్రామంలో సంపన్న రైతు కుటుం బంలో నల్లపురెడ్డి, వెంకటమ్మ దంపతులను జన్మించారు. పెద్దగా చదవక పోయినా తల్లినుండి దానగుణాన్ని, దాని గొప్పదనాన్ని గ్రహించారు. సంతానం కలుగ నందున తన తమ్ముని కుమారుని దత్తత తీసుకున్నారు. బాల్యం నుండే దానగుణం ఆయన వెంట నడిచింది. ఆపన్నులకు ఆసరా అందించడమే ఆయనకు నిత్య కృత్యంగా మారింది. కరవు బారిన పడిన పేదలకు తన ఆపన్న హస్తం చాచి కడుపు నిండా అన్నం పెట్టి కలియుగ దానకర్ణుడని పేరుపొందిన బుడ్డా వెంగళరెడ్డి. తనకు ఉన్నాదంతా దానం చేసిన మహానుభావుని దాతృత్వానికి పరాయి పాలకులు సైతం ఆశ్చర్య పోయారు. అందుకే విక్టోరియా మహారాణి ఆయన సేవలను గుర్తించి బంగారు పతకాన్ని బహుమానంగా ఇచ్చింది. బుడ్డ వెంగళరెడ్డి (1840 - 1900) 1866 కాలంలో సంభవించిన డొక్కల కరువు కాలంలో తన ఆస్తినంతా ధారపోసి ఎంతోమంది ప్రాణాల్ని కాపాడిన మహా దాత. పలు ప్రాంతాల నుండి తండోప తండాలుగా ఉయ్యాలవాడ చేరి రెడ్డిని ఆశ్రయించారు. వారి దీన స్థితిని అర్థంచేసుకున్న రెడ్డి ఇంట్లో ఉన్న ఆరు పుట్ల ధాన్యాన్ని గంజి కాయించి వేలాది కుటుంబాల ఆకలి తీర్చారు. పూటకు ఎనిమిది వేలకు తక్కువ కాకుండా ఈ కరవు కాలంలో బుడ్డ వెంగళరెడ్డి కరవు పీడితులైన ప్రజలకు మూడు నెలల పాటూ అన్న వస్త్రాలు ఇచ్చి కన్న తండ్రి లాగా కాపాడాడు. రాయల సీమలో పుట్టిన అపర దానకర్ణుడు వెంగళరెడ్డి. వంటమనిషి గంగన్న ఆకాలంలో చేసిన సేవలకు మెచ్చిన రెడ్డి అతనికొక బంగారు కడియం తొడిగి సత్కరించారు. అనంతర కాలంలో స్వగ్రామంలో పాఠశాలను నెలకొల్పి విద్యాదానం చేశారు. రెడ్డి సేవలను గుర్తించి విక్టోరియా బంగారు పతకాన్ని బహూక రించింది. ఢిల్లీలో 1877 జనవరి 1వ తేదీన జరిగిన సన్మాన సభలో బంగారు పతక బహూకరణ జరిగింది. ఆ బంగారు పతకముపై క్రింది విధంగా చెక్కబడింది. "1866వ సంవత్సరంలో సంభవిం చిన క్షామకాలమందు, నిరాధా రంగా నుండిన, తన స్వదేశస్థుల పట్ల జరిపించిన ఉత్కృష్ట ఔదార్యం నకు హర్ మైజెస్టి రాణిగారి వల్ల చేయబడిన శ్రేష్టమైన గణ్యతకు ఆనవాలుగా బుడ్డా వెంగళరెడ్డి గారికి బహుమాన మివ్వబడినది.

# చిన్నంబావి పోలీసుల హెచ్చరిక

## నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా జరుపుకోవాలి ఎస్సై నాగరాజు

**అగ్ని ధార న్యూస్ చిన్నంబావి మండలం** చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి. గ్రామాలలో ప్రజలు యువత నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండలంలో శాంతి భద్రతలు భంగం కలగకుండా ఉండేందుకు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ క్రింది నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. చిన్నంబావి ఎస్సై ఏ నాగరాజు తెలిపారు. గ్రామాలలో ప్రజలు నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇవి అస్సలు చేయవద్దు డ్రంక్ అండ్ డ్రైవ్, మద్యం సేవించి వాహనం నడిపితే వాహనం సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా మరియు కేసు నమోదు చేయబడుతుంది. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్‌లు, అతివేగంగా వాహనాలు నడపడం, సైలెన్సర్లు తొలగించి శబ్దం చేయడం నిషేధం. బహిరంగంగా మద్యం సేవించడం రోడ్లు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం. డీజే నిషేధం, శబ్ద కాలుష్యం కలిగించే డీజేలు, అధిక శబ్దంతో మ్యూజిక్ సిస్టమ్‌లకు అనుమతి లేదు. అసభ్య ప్రవర్తన రహదారులపై గుంపులు గుంపులుగా చేరి ఇతరులకు అసౌకర్యం కలిగించడం, అసభ్యంగా ప్రవర్తించడం నేరం. అనుమతి లేని ర్యాలీలు / వేడుకలు పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, పార్టీల నిర్వహణకు వీలు లేదు. పబ్లిక్ ప్రాపర్టీకి నష్టం రోడ్ సైన్ బోర్డులు, స్ట్రీట్ లైట్లు తదితర ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే కేసులు నమోదు చేస్తారు. ఇవి తప్పనిసరిగా గుర్తుంచుకోండి పోలీసు అనుమతి తప్పనిసరి ఏదైనా ఈవెంట్, పార్టీ లేదా సమావేశం నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. సైబర్ భద్రత న్యూ ఇయర్ ఆఫర్ల పేరుతో వచ్చే ఫేక్ లింక్స్, కాల్స్‌కు స్పందించవద్దు. బ్యాంక్, ఓటీపీ వివరాలు ఎవరికీ ఇవ్వకండి. మైనర్లకు వాహనాలు ఇవ్వ కండి. ఇలాంటి ఘటనల్లో తల్లిదండ్రుల పై కూడా చర్యలు ఉంటాయి. సీటుబెల్ట్, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహన దారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. పోలీస్ తనిఖీలకు ప్రజలు సహకరించాలి. మీ క్షేమమే మా బాధ్యత నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ఆనందంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని మండల పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి. అని చిన్నంబావి మండల ఎస్సై నాగరాజు చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలకు తెలియజేశారు.




# గూడెం గ్రామంలో స్మశాన వాటికలో బోర్ వేయించిన సర్పంచ్

### ఎన్నికల హామీని నిలబెట్టుకున్న నూతన సర్పంచ్ కొత్త వెంకట్ రెడ్డి

**అగ్నిధార న్యూస్ చిన్నంబావి మండలం** చిన్నంబావి మండల పరిధి లోని గూడెం గ్రామంలో నూతన సర్పంచ్ కొత్త వెంకట్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసి ప్రజల ప్రశంసలు పొందారు. గ్రామంలోని యాదవుల స్మశాన వాటిక వద్ద నీలబోరు వేయించగా, బోరులో ఒకటిన్నర ఇంచుల మేర నీరు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. స్మశాన వాటికలో నీటి సదుపాయం లేక అంత్యక్రియల అనంతరం దాన సంస్కారాలు పూర్తి చేసిన తర్వాత చేతులు, కాళ్లు కడుక్కోవడానికి తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నామని యాదవ సోదరులు పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ కొత్త వెంకట్ రెడ్డి, ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు శాశ్వత పరిష్కారం చూపారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. అదేవిధంగా సర్పంచ్ గ్రామంలోని వీధుల గుండా తిరిగి ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సైడ్ డ్రైనేజీలు, వీధి దీపాల సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అన్ని సమస్యలను ఒకేసారి పరిష్కరించడం సాధ్యం కాకపోయినా, దశలవారీగా ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతానని సర్పంచ్ ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 4 వార్డు కురువ వెంకటస్వామి, ఐదవ వార్డు సభ్యులు గుంది పర్ల బాలకృష్ణ, గుంది పర్ల శివుడు, దయపు శివుడు, బత్తుల నారాయణ, పెద్ద నరసింహ, మద్దూరి శ్రీను వాసులు. బత్తుల శేఖర్, అంబయ్య గారి బిచ్చన్న, మద్దూరి కురుమయ్య, రాఘవేంద్ర శెట్టి, బాయి గడ్డ గోపాల్, పోచమోని శాంతయ్య, చట్టమోని రామకృష్ణ, పి. బాలకృష్ణ, సింగోటం బాలస్వామి, భాస్కర్, బీరయ్య, శేర్‌పల్లి వెంకటస్వామి, మార్కం మల్లయ్య, ఎం. ప్రవీణ్, ఆర్. శేఖర్, చట్టమోని నరసింహ, మద్దూరి నాగశేషి తదితరులు పాల్గొన్నారు.



## రోగాల బారీ నుండి పశు సంపదను కాపాడు కోవాలి సర్పంచ్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలంలోని చౌదర్ పల్లి గ్రామంలో గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందును పశు వైద్య సిబ్బందితో కలిసి సర్పంచ్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి వేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమయానికి మందులు వేసి రోగాల నుండు పశువులను కాపాడుకోవాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది నరేష్ రెడ్డి, బాలు, నాయకులు గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు కొండల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నవారు

# చెన్నకేశవుల స్వామి టెంపుల్ దగ్గర బోరుకు మరమ్మతులు

### గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్

**అగ్నిధార న్యూస్ చిన్నం బావి మండలం** చిన్నంబావి మండల పరిధిలోని చిన్నమారుర్ గ్రామ లో గత కొన్ని రోజులుగా చెన్నకేశవ స్వామి టెంపుల్ దగ్గర బోరు చెడిపోవడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు నూతన గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్ గారి దృష్టికి తీసుకురావడం జరిగింది. తక్షణమే స్పందించిన గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, బోరు మోటర్ ను తొలగించి పరిశీలన చేయడం జరిగింది. మెకానిక్ బోరు మోటర్ పూర్తిగా చెడిపోవడం జరిగింది మరియు కాలిపోవడం జరిగింది ఈ మోటారు పనికిరాదు ఈ స్థలములో కొత్త మోటర్ వెయ్యాలని సూచించడం జరిగింది. తక్షణమే కొత్త మోటర్ తెప్పించి వేయించడం జరిగింది. ప్రజల అవసరాల నిమిత్తము కొత్త మోటర్ వేసి నీళ్లు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ప్రస్తుతము ఆ మోటర్ ద్వారా నీళ్లు ప్రజలకు అందుబాటులోకి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, గ్రామ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొనడం జరిగింది.



# పేద కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచిన హెల్పింగ్ హ్యాండ్స్

**అగ్నిధార న్యూస్ కమాన్‌పూర్** గుండారం గ్రామానికి చెందిన గౌడ సంఘం పెద్దమనిషి వడ్లకొండ పెద్ద మల్లయ్య గౌడ్ మృతి పేద కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. 29-12-2025 రాత్రి 10 గంటల 30 నిమిషాలకు ఆయన కన్నుమూయగా, తీవ్ర పేదరికం కారణంగా చివరి దహన సంస్కారాలకు కూడా అవసరమైన ఆర్థిక సాయం లేక కుటుంబం అశక్త స్థితిలో నిలిచింది. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీష్ గౌడ్ వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటారు. దహన సంస్కారాల నిర్వహణ కోసం రూ.20,000 నగదు సాయం అందించడమే కాకుండా, రైస్ బ్యాగులు, నిత్యావసర సరుకులు అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఇకపై కూడా కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తామని హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు భరోసా ఇచ్చారు. ఈ సహాయక కార్యక్రమంలో గీసగోని శ్రీనివాస్, గరిగంటి విష్ణు, మచ్చ గణేష్, వడ్లకొండ అభిరామ్, వడ్లకొండ శంకర్‌తో పాటు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.



## జల్లి మద్దిలేటి భౌతిక కాయానికి నివాళులర్పించిన చిన్నంబావి మండల మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ

### పెద్దమారు గ్రామ మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్ రెడ్డి




**అగ్ని ధార న్యూస్ చిన్నంబావి మండలం**వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామానికి చెందిన జల్లి పెద్ద మద్దిలేటి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందారు. చికిత్స నిమిత్తం కర్నూల్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్ రెడ్డి, మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్ రెడ్డి, మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కేతపగ సుధాకర్, కావాలి భరత్, జల్లి తిరుపతి, జగ్గారి భగవంత రెడ్డి, ఆటో నాగేష్, వెంకటేష్, మూగి తిపులయ్య, పసుల రవి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో పోటీ చేస్తే తప్పా!

### కార్మికుడిని తొలగించిన అల్ట్రాటెక్ యాజమాన్యం

### కలెక్టరేట్‌లో బాధితుడి ఆవేదన



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ఎన్నికల్లో పోటీ చేస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తారా! అని ఓ బాధితుడు కలెక్టరేట్ మెట్లెక్కాడు. పాలకుర్తి మండలం బసంత్ నగర్ కృష్ణానగర్‌కు చెందిన తువ్వ సతీష్ యాదవ్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగిగా విధుల్లో ఉన్నాడు. ఈ నెల 14న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సతీష్ యాదవ్ సర్పంచి అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే ఆయన ఎన్నికల బరిలో నిలవడాన్ని జీర్ణించుకోలేని కంపెనీ యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా షోకాజ్ నోటీసు జారీ చేసిందని బాధితుడు ఆరోపించారు.?సింగరేణి వంటి దిగ్గజ సంస్థల్లో లేని నిబంధనలు ఇక్కడ ఎలా ఉంటాయని, నోటీసుల వల్ల మానసిక ఒత్తిడికి గురై ఎన్నికల్లో ఓడిపోవడమే కాకుండా, ఇప్పుడు తన ఉద్యోగాన్ని కూడా కోల్పోయానని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. కంపెనీపై చర్యలు తీసుకుని, తన ఉద్యోగాన్ని తిరిగి ఇప్పించి తన కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)ని ఆదేశించారు.

## ఎలక్షన్ డ్యూటీకి ఓడీగా పరిగణన

### క్లరికల్ సిబ్బందికి ఊరట సిక్కా కృషి ఫలితం

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :** గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన సింగరేణి కాలరీస్‌కు చెందిన క్లరికల్ సిబ్బందికి ఎలక్షన్ డ్యూటీని ఓడీ (ఆన్ డ్యూటీ)గా పరిగణించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటివరకు కొన్ని సందర్భాల్లో ప్రత్యేక సెలవులు (స్పెషల్ లీవ్) మంజూరు చేసిన నేపథ్యంలో, ఎన్నికల విధులను ఓడీగా గుర్తించాలని సింగరేణి కాలరీస్ క్లరికల్ స్టాఫ్ అసోసియేషన్ (సిక్కా) తరఫున పలుమార్లు వినతులు అందజేశారు. సిక్కా అధ్యక్షులు బొల్లం మధు, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ట్రెజరర్ బత్తుల పోషం ఆధ్వర్యంలో అన్ని ఏరియాల నుంచి వచ్చిన వినతులను యాజమాన్యానికి తెలియజేశారు. ఈ వినతులను పరిశీలించిన అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికల విధులకు హాజరైన క్లరికల్ సిబ్బందికి ఎలక్షన్ డ్యూటీని ఓడీగా పరిగణించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయంతో ఎన్నికల విధులు నిర్వర్తించిన క్లరికల్ సిబ్బందికి న్యాయం జరిగిందని, ఇది సిక్కా నాయకుల కృషి ఫలితమని ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు సిక్కా నిరంతరం కృషి చేస్తుందని సంఘ నాయకులు తెలిపారు.

## గ్రామ ప్రజల కోరికమేరకు దాహార్తిని తీర్చిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఉప్పల వెంకటేష్





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామంలో త్రాగు నీటి సమస్య తో ప్రజలు ఎదుర్కొంటున్న విషయం స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దృష్టికి గ్రామ సర్పంచ్ తీసుకువెళ్లగా వెంటనే తన సొంత డబ్బులతో కొత్త మోటర్ కొనిచ్చి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చడం జరిగింది. ఉప్పల వెంకటేష్ తమ గ్రామానికి అండగా ఉండి సమస్యను పరిష్కరించినందుకు గ్రామ సర్పంచు, ఉప సర్పంచ్ గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ సుమిత్ర భీమయ్య, ఉపసర్పంచ్ కేశవులు, రాజు, రవి, ఆంజనేయులు,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# దివాళా తీసేలా మితిమీరిన రాజకీయ జోక్యం

## సింగరేణిని ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తున్న రాష్ట్ర సర్కార్
## విమర్శించే నైతిక హక్కు జాతీయ సంఘాలకు లేదు
## నిధుల దుర్వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
## టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల

**అగ్ని ధార న్యూస్, (రామగుండం):** మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల సింగరేణి ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి ఆరోపించారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వల్ల సింగరేణి తీవ్రంగా నష్టపోతుందని వాపోయారు.సంస్థను పీల్చి పిప్పి చేసే విధానాలను అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందని,ఓవర్ డ్రాఫ్టతో వేతనాలు చెల్లించే పరిస్థితి తలెత్తిందని రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.సి ఎస్ ఆర్,డి ఎం ఎఫ్ టి నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తుందని,కార్పొరేషన్ చేయాల్సిన పనులను సింగరేణి చే చేయించడం ఎంతవరకు సమంజసమని,ఈ విషయంలో అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు ఇపుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి సంబంధించిన నిధుల దుర్వినియోగం పై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రాన్స్కో జెన్కో తదితర సంస్థల నుంచి సింగరేణికి రావలసిన రూ.47 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వమే చెల్లించాలని,పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో రూ.29వేల కోట్ల బకాయి పడిందని,రెండేళ్ల కాంగ్రెస్ హయాంలో రూ.24 వేల కోట్ల బకాయి పడిందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ రాజకీయ జోక్యం వల్ల సింగరేణి కార్మికుల హక్కులు,సంక్షేమం విద్యా వైద్యానికి ఉపయోగపడిందిని కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ జోక్యం వల్ల సింగరేణి అన్ని రకాలుగా నష్టపోతుందని చెప్పారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టియుసి వంత పాడుతున్నాయని ఆక్షేపించారు.కార్మిక హక్కులను కాలరాస్తున్న జాతీయ సంఘాలకు టిఆర్ఎస్ పార్టీని గాని టీబీజీకేసును గాని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. విలేకరుల ఈ సమావేశం లో నాయకులు నూనె కొమురయ్య మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి,జాహెద్ పాషా,పోలాడి శ్రీనివాస్,గండి శ్రీనివాస్, గోపి,రాజ్ కుమార్,సంతోష్ రోడ్డ సంపత్ పాల్గొన్నారు.

## పేద వైద్య విద్యార్థికి అండగా అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్..

**– డీఎస్పీ ఎదుల్ల కిషోర్ చేతుల మీదుగా స్టడీ మెటిరియల్ అందజేత**




**పెద్దపల్లి అగ్నిధార న్యూస్ :** ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో యశ్వంత్ రత్న అనే పేద విద్యార్థి ఎంబిబిఎస్ చదువుతున్నాడు. అతని పేదరికం కారణంగా స్టడీ మెటీరియల్ కోసం ఇబ్బందులు పడుతుండగా వారి తండ్రి అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్ ను సంప్రదించారు. దీంతో స్పందించిన అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కల్వల రాజ్‌కుమార్ అండగా నిలిచారు. డీఎస్పీ ఎదుల్ల కిషోర్ చేతుల మీదుగా వైద్య విద్యార్థి యశ్వంత్ రత్న తండ్రికి స్టడీ మెటీరియల్స్ ను మంగళవారం అందజేశారు. కాగా నిరుపేద విద్యార్థులకు తమ ట్రస్ట్ అండగా నిలుస్తుందన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కల్వల రాజ్‌కుమార్‌ను ఈ సందర్భంగా డీఎస్పీ ఎదుల్ల కిషోర్ అభినందించారు.

## మార్నింగ్ వాక్ లో గ్రామ సమస్యలు పరిష్కారం

**చౌదర్పల్లి సర్పంచ్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలంలోని చౌదర్ పల్లి గ్రామ పంచాయతీ లో కాలనీలల్లో ఉన్న వివిధ సమస్యలను తెలుసుకోవడానికి గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గంతో కలిసి గ్రామ సర్పంచ్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి మార్నింగ్ వాక్ లో గల్లీ గల్లీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయం గా పలకరిస్తూ, ప్రజల యొక్క సమస్యలు, గ్రామంలో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ సమస్యలను చెప్పుకుంటూ మీ వల్లనే గ్రామంలో ప్రతి గల్లీకి సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు అన్నారు. ఇకనుండి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో లేనటు వంటి అన్ని మౌలిక సదుపాయాలను అభివృద్ధి పనులను దేవాలయాలను పూర్తి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చేదిద్దుతానని ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఉప సర్పంచ్ రాజీవ్, వార్డు సభ్యులు ఈరగళ్ల పుష్పలత, చంద్రశేఖర్, దొబ్బల రమేష్, దువాసి జంగయ్య, ఎనుముల సాయి, దువాసి విజయ శ్రీశైలం కొప్పు కృష్ణమ్మ లొడిగ తిరు పతయ్య గ్రామ పంచాయతీ సెక్రెటరీ హాజీబాబా, ఆశ వర్కర్ భారతమ్మ అంగన్వాడీ కార్యకర్త చంద్రకళ మరియు నాయ కులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 1 నుంచి రానున్న మార్పులు

**హైదరాబాద్ :** మరో రెండు రోజుల్లో 2025 సంవత్సరం ముగిసి, 2026 కొత్త సంవత్సరం ప్రారంభం కాబోతోంది. జనవరి 1 నుంచి సామాన్యుడి జేబుపై, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలపై, రైతుల సంక్షేమ పథకాలపై ప్రభావం చూపే అనేక కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. బ్యాంకింగ్, పన్ను విధానాలు, గ్యాస్ ధరలు వంటి అంశాల్లో వస్తున్న ఈ మార్పులను ప్రజలు గమనించాల్సి ఉంది.ప్రధానంగా పాన్-ఆధార్ అనుసంధానం అత్యంత కీలకం కానుంది.ఇప్పటికీ వీటిని లింక్ చేయని వారి బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ అయ్యే ప్రమాదం ఉంది. బ్యాంకింగ్ సేవలు, పన్ను రిఫండ్లు నిలిచిపోకుండా ఉండాలంటే తక్షణం ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే.

# శ్రీ పద్మావతి సామెత తిరుమలనాథ స్వామి గుడిలో అంగరంగ వైభవంగా పూజలు

**అగ్నిదార న్యూస్ చిన్నంబావి మండలం** చిన్నంబావి మండలంలో పెద్ద దగడ గ్రామములో శ్రీ పద్మావతి తిరుమలనాథ స్వామి టెంపుల్ లో ఆలయ పూజారి ఉత్పల నరేష్ కుమర్ సౌజన్యంతో అంగరంగ వైభవంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ పద్మావతి సామెత తిరుమల నాత స్వామి కళ్యాణ మహోత్సవం కళ్యాణ మహోత్సవం జరిగింది స్వామివారిని అలంకరణతో పూలతో అలంకరణ చేసి స్వామివారికి నూతన వస్త్రలతో కల్యాణ మహోత్సవం చేసి గ్రామ పెద్దల సమక్షంలో మరి భక్తుల సమక్షంలో స్వామివారికి అంగరంగ వైభవంగా పండుగ వాతావరణం నెలకొన్నడా జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో భక్తులు పాల్గొని భజన కీర్తనలతో పాటలతో ఆలరించి ఈ యొక్క పురాతన టెంపుల్ లో చాలా ఏళ్ల నుండి కొనసాగుతున్న కళ్యాణ మహోత్సవంలో కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ యొక్క కార్యక్రమంలో గ్రామస్తులు



పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# చట్టానికి లోబడి నూతన సంవత్సర వేడుకలు

## తాత్కాలిక ఆనందం కోసం భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
## పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**అగ్నిధార న్యూస్, ( రామగుండం) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, వేడు కలను శాంతియుతంగా, చట్టానికి లోబడి నిర్వహించుకోవా లని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక ఆనందం కోసం భవిష్యత్తును నాశనం చేసుకునేలా ప్రవర్తించవద్దని ఆయన హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి 10 గంటల నుంచి కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి, బైండ్‌ఓవర్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలని సూచించారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా, ప్రమాదాలకు దూరంగా ఉండాలని కోరారు.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్థానిక పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, షీ టీమ్స్, మఫ్టీ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో కలిసి ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్రమ సిట్టింగులు, బహిరంగ మద్యం సేవనం, మహిళల వేధింపుల వంటి ఘటనలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.వేడుకలను అర్ధరాత్రి 12.30 గంటలలోపు ముగించుకోవాలని సూచిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలకు ముందస్తు పోలీస్ అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని, వేడుకల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.డీజేలు, మైకుల వినియోగం, బాణసంచా పూర్తిగా నిషేధించబడిందని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణాలు, వైన్ షాపులు, బార్లు ప్రభుత్వం నిర్ణయించిన సమయాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వేగంగా లేదా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపిన వారిపై వాహనాలు సీజ్ చేయడం, జరిమానాలు విధించడం, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినప్పటికీ చర్యలు తప్పవన్నారు.యువతపై కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు, విదేశీ ప్రయాణాల విషయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరిస్తూ, మద్యం సేవించకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ ఉంచాలని కోరారు.వేడుకల సందర్భంగా వాహన తనిఖీలు, పికెట్లు, మఫ్టీ టీమ్స్, కీలక కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు వంటి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సమేతంగా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, చట్టబద్ధంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# విశ్వబ్రాహ్మణుల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**కృతజ్ఞతలు తెలిపిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ప్రతినిధులు**

**అగ్నిధార న్యూస్, (రామగుండం):** వృత్తులు కోల్పోయి, ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ అప్పుల భారంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న విశ్వబ్రాహ్మణుల సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించిన రామగుండం ఎమ్మెల్యే మఖన్ సింగ్ రాజ్ ఠాకూర్‌ను విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ప్రతినిధులు మణికొండలోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ ప్రభావంతో సంప్రదాయ వృత్తులను కోల్పోయి దినసరి కూలీలుగా మారుతు న్న విశ్వకర్మలు తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఆత్మహత్యలకు పాల్పడుతున్న కమ్యూనిటీగా మారుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామగ్రామాలుగా నిర్వహించిన సుదీర్ఘ పాదయాత్రలో విశ్వబ్రాహ్మణుల దీనస్థితిని ప్రభుత్వం, రాజకీయ పార్టీల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేశామని తెలిపారు. ఇలాంటి తరుణంలో అసెంబ్లీలో తమ సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు విశ్వబ్రాహ్మణ జాతి ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ విశ్వనాథుల పుష్పగిరి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మఖన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విశ్వకర్మ కుటుంబాలతో కలిసి పెరిగినవాడి నని, వారి కష్టాలు తనకు మూలం నుంచి తెలుసని పేర్కొన్నారు. కొలిమి చుట్టూ, పనిముట్ల మధ్య గడిపిన బాల్యస్మృతులు ఇప్పటికీ గుర్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు వెలుగొందిన విశ్వబ్రాహ్మణ జాతి నేడు కార్పొరేటీకరణ కారణంగా కుంగిపోతుండటం బాధ కలిగిస్తోందని, ఆ ఆవేదనతోనే అసెంబ్లీలో వారి సమస్యలను ప్రస్తావించానని చెప్పారు. సభానంతరం ముఖ్యమంత్రితో ఈ అంశంపై చర్చించానని, సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మారెళ్ళ దైవజ్ఞ పరమేష్ గురూజీ, గజ్జెల శ్రీనివాస్ చారి, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొండోజు ప్రవీణ్ కుమార్, గంగా భవాని, యువజన విభాగం అధ్యక్షులు మునిగంటి త్రినాథ్ చారి, అందోజు గణేష్ చారి, నిర్మల్ జిల్లా కన్వీనర్ దోనోజు అభిలాష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 2 నుంచి 11 వరకు సానిటేషన్ స్పెషల్ డ్రైవ్

**నగరవ్యాప్తంగా పరిశుభ్రతపై దృష్టి**

**: జె. అరుణ శ్రీ**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం), :** నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో జనవరి 2 నుంచి 11 వరకు రామగుండం నగరంలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) జె. అరుణ శ్రీ తెలిపారు.ఈ మేరకు మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.అవసరమైన పక్షంలో అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించుకుని షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో మురుగు నీటి కాలువల పూడిక తీత, పిచ్చి చెట్లు, పొదల తొలగింపు, వీధుల ఊడ్చివేత, చెత్త కుప్పల తొలగింపు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల క్లియరెన్స్ వంటి కార్యక్రమాలు చేపడతామని వివరించారు. అలాగే ప్లాస్టిక్ నిషేధాన్ని ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించడం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఎస్ఈ గురువీర, ఈఈ రామన్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, సెక్రటరీ ఉమా మహేశ్వర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీహరి, ఆర్ఓ ఆంజనేయులు, డీఈ శాంతి స్వరూప్, ఏఈ జమీల్, సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగభూషణం, సంపత్, మెప్మా టీఎంసీ మౌనిక, సీఓలు, వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్లు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ చట్టం రద్దు చేయాలి

**ఏఐసీసీ నేత కొప్పుల రాజుకు మాలమహానాడు వినతి**

**అగ్నిధార న్యూస్,(రామగుండం) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం 2025ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు జాతీయ కమిటీ నేతలు ఏఐసీసీ న్యూ ఢిల్లీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ఎస్సీ ఎస్టీ ఓబీసీ సలహా మండలి చైర్మన్, రాహుల్ గాంధీ రాజకీయ బృంద నాయకుడు, మాజీ పీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ కొప్పుల రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ కమిటీ గౌరవ అధ్యక్షులు, సుప్రీంకోర్టు అడ్వకేట్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం వల్ల ఎస్సీ జాబితాలోని 58 కులాల భవిష్యత్తు తీవ్ర ప్రమాదంలో పడిందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమం, జీవన రంగాల్లో రాజ్యాంగం కల్పించిన అవకాశాలు దక్కకుండా ఈ చట్టం అడ్డంకిగా మారిందని ఆరోపించారు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధానంగా దళిత కులాలే కారణమని, ముఖ్యంగా మాల ఉపకులాల ఓట్లతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. అలాంటి పరిస్థితిలో అవగాహన లేకుండా ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాలలకు వెన్నుపోటు పొడిచినట్టుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయకపోతే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గడ్డు కాలం తప్పదని హెచ్చరించారు.మాలమహానాడు ప్రతినిధుల వినతి పత్రంపై స్పందించిన కొప్పుల రాజు.. ఈ అంశాన్ని పార్టీ అధిష్టానం రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ జయంతి నటరాజన్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జె.ఎన్. రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

**బాధితులకు పోలీసులే అండగా ఉంటారనే నమ్మకం కల్పించాలి**

**సీపీ అంబర్ కిషోర్ ఝా**

**అగ్నిధార న్యూస్, (రామగుండం):** పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, పోలీసులే అండగా ఉంటారనే నమ్మకం, భరోసాను బాధితులకు కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ జన్నారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న సీపీకి పోలీస్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.తనిఖీల్లో భాగంగా స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన సీపీ, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే సిబ్బంది శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. జన్నారం పరిసర ప్రాంతం మారుమూల అటవీ ప్రాంతం కావడంతో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పోలీసులపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి క్రమశిక్షణతో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతో పాటు, మర్యాదపూర్వకంగా ఫిర్యాదులను స్వీకరించి చట్ట పరిధిలో పరిష్కారం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో ఇంట్లోనే ప్రశాంతంగా జరుపుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, సీఐ రమణమూర్తి, ఎస్ఐ అనూష పాల్గొన్నారు.

## గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ

**పడకల్ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు రెండు సంవత్సరాల నుంచి మందులు రాలేదు అని జి.ఎం.పి.ఎస్ సంఘం పోరాటాల ఫలితంగా ఎన్నోసార్లు కలెక్టర్ ఆఫీసులో మండల ఆఫీసులో వినతి పత్రాలు ఇవ్వడంతో గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకొచ్చింది.జి.ఎం.పి.ఎస్. గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నట్టల మందు రావడం జరిగిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి అలాగే పడకల్ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి కి సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పడకల్ సర్పంచి సునీత. తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి.ఉప సర్పంచ్ రాఘవేందర్. సొసైటీ అధ్యక్షులు. జల్లుల పెంటయ్య వార్డ్ సభ్యులులు. గ్రామ యువకులు గ్రామ పెద్దలు గొర్ల కాపర్లు. తదితరులు పాల్గొన్నారు

# నిరుపేదల కళ్ళల్లో వెలుగులు నింపిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

## 143 మంది కంటి శుక్లాల ఆపరేషన్ల పూర్తి

### విజయవంతంగా ముగిసిన ఐక్యత ఫౌండేషన్ నాల్గవ కంటి వైద్య శిబిరం







**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల మండల కేంద్రంలోని శ్రీ వాసవి ఫంక్షన్ హాల్ లో గత తొమ్మిది రోజులుగా మాడ్గుల మండల పరిసర ప్రజలకు సేవలు అందించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శంకర నేత్రాలయ చెన్నై వారిచే ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిభిరం. తొమ్మిది రోజుల శిబిరానికి 5,500 మందికి పైగా శిబిరానికి హాజరవ్వగా,3,800 మందికిపైగా ఉచిత కంటి పరీక్షల నిర్వహణ, 2,600 పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ,చేయడం జరిగింది. 143 మంది కంటి శుక్లాల పేషెంట్లకు విజయ వంతంగా ఆపరేషన్ లు పూర్తి కావడం జరిగింది. ఈ సందర్భంగా ముగింపు వేడుకకు హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఐక్యత ఆరోగ్య భరోసా అనే కార్యక్రమంలో బాగంగా మేము నియోజకవర్గ వ్యాప్తంగా మూడు ఉచిత ఐక్యాంప్ లు పూర్తి చేసుకొని,నాల్గవ క్యాంప్ మాడ్గుల గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో సౌకర్యవంతంగా ఏర్పాటు చేసి,అవసరమైన వారికి కంటి అద్దాలు మరియు ఖర్చుతో కూడుకున్న కంటి ఆపరేషన్లు ఉచితంగా అందించి,వారికి నిరుపేదలకు కంటి ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తూ వారికి భరోసానివ్వడమే ధ్యేయంగా ముందుకు సాగామని, ఇప్పటి వరకు నియోజక వర్గ వ్యాప్తంగా 568 మందికి విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి చేశామని,10వేల మందికిపైగా ఉచితంగా కంటి అద్దాల, పంపిణీ చేశామని, క్యాంప్ ను సద్వినియోగం చేసుకున్న మాడ్గుల మండల మరియు పరిసర ప్రాంత ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రతి వ్యక్తికీ దాదాపు కంటి సమస్యను తీర్చే ప్రయత్నం చేశామని మా ఈ ప్రయత్నం విజయవంతం అయ్యిందని భావిస్తూ,మా సేవలు ఇలాగే కొనసాగుతాయని ప్రతి పేదవాడికి వైద్యం అనేది భారం కావొద్దని అందుకు తగ్గట్టుగా మేము మరిన్ని కార్యక్రమాలతో ముందుకు సాగుతామని తెలియజేశారు. ఈ సందర్భంగా కంటి వైద్య శిభిరం సేవలు వినియోగించుకున్న ప్రజలు మాట్లాడుతూ.ఇంత గొప్ప కార్యక్రమాన్ని మధుల మండలంలో ఏర్పాటు చేసి మా కంటి సమస్యలను తీర్చి,మాకు చూపును అందించిన సుంకిరెడ్డి రాఘ వేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, మాకు పెద్ద కొడుకుల అన్ని తానై వారి ఆపరేషన్లు చేయించా దని జీవితాంతం సుంకిరెడ్డి రాఘవేందర్రెడ్డి సేవను మరువబోమని వారికి ఎల్లపుడు తోడుగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి సుంకిరెడ్డి సుభాషిణి తో పాటుశంకర నేత్రాలయ వైద్యులు డా. ఆర్తీ రాజ్ కుమార్ మరియు రాజీవ్ కుమార్ ఇంచార్జ్ బాను ప్రకాష్ రెడ్డి మరియు ఐక్యత మాడ్గుల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డి, సబ్యులు నాగిళ్ళ శివ, ఎరుకలి శివ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా

**సానుభూతి తెలుపుతూ 10,000 వేలు అందజేసిన మాజీ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** చారకొండ మండలం చంద్రాయన్ పల్లి గ్రామానికి చెందిన కందుకూరి వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న మాజీ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ భాస్కర్ రావు యువసేన సభ్యుల ద్వారా వారి 10 వేల రూపాయలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ మండల నాయకులు అప్పల శేఖర్ గౌడ్, జూపల్లి సర్పంచ్ అనూష జగపతి, జూపల్లి భాస్కర్ రావు యువసేన సభ్యులు ఎండి సిరాజ్, సత్యం యాదవ్, శివ యాదవ్, చంద్రాయన్ పల్లి బిఆర్ఎస్ నాయకుల తదితరులు పాల్గొన్నారు.

## రహదారి అభివృద్ధికి 3 కోట్ల 75 లక్షల నిధులు మంజూరు



**అగ్నిధార న్యూస్ మంథని :**మంథని మండలం గుమ్మనూరు గ్రామపంచాయతీలోని లక్ష్మీపూర్ నుండి కాకర్ల పల్లె మీదుగా దంతాలపల్లి వరకు బీటి రోడ్డుకు మూడు కోట్ల 75 లక్షలతో డి ఎం ఎఫ్ టి నిధులు మంత్రి శ్రీధర్ బాబు మంజూరు చేయడం జరిగిందని దంతాలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఎరుకల నరేష్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చిత్ర పటానికి గుమ్మనూరు, దంతాలపల్లి గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. శ్రీధర్ బాబుకు జీవితాంతం రుణపడి ఉంటామని అభినందనలు తెలియజేశారు. 1990 సంవత్సరంలో శ్రీపాదరావు దంతలపల్లి గ్రామాన్ని నిర్మించారని, మంథని మండలంలోనే అతి చిన్న గ్రామం దంతాలపల్లి నిరుపేదల కోసం శ్రీధర్ బాబు గొప్ప ఆలోచన చేసి మాకు మళ్ళీ 3కోట్ల 75 లక్షల రూపాయలతో రోడ్డు మంజూరు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ దంతాలపల్లి గ్రామంలో 25 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని నరేష్, గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కవులు, కళాకారుల ప్రోత్సాహానికి ఎల్లప్పుడూ సిద్ధం- లోకనాథ్ రెడ్డి




**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి కవులు, కళాకారులను ప్రోత్సహించడం, వారికి ఆర్థికంగా, హృదయపూర్వకంగా సహాయ సహకారాలు అందించడం తనకు ఎంతో ఇష్టమని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వనపర్తిలో నిర్వహించిన గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన "ఖాళీ కుర్చీ" పుస్తక ఆవిష్కరణ సందర్భంగా పరిచయమైన మిత్రుడు డాక్టర్ సురేష్ విశ్వతో పాటు ఆయన మిత్రబృందం చేపడుతున్న సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు తాను ఎప్పుడూ వెన్నంటి ఉంటానని అన్నారు.వనపర్తి ప్రజలకు ఉపయోగపడే ఏ కార్యక్రమమైనా తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని లోకనాథ్ రెడ్డి స్పష్టం చేశారు.

## టిటియు జిల్లా అధ్యక్షుని నియామకం



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** తెలంగాణ టీచర్స్ యూనియన్(టిటియు) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా ముత్తారం మండలం పోతారం ప్రాథమిక పాఠశాల పనిచేస్తున్న కుల్ల రాజేందర్ ను నియామకం చేసినట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునగాల మహిపాల్ రెడ్డి, పొలంపల్లి ఆదర్శన్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా కుల్ల రాజేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని, ప్రభుత్వానికి ఉపాధ్యాయుల గళాన్ని బలంగా వినిపించే విధంగా సంఘాన్ని ముందుకు నడిపిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం తెలంగాణ టీచర్స్ యూనియన్ కృషి చేస్తుందని ఆయన అన్నారు. అధ్యక్షునిగా తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులు, ఉపాధ్యాయులకు కుల్ల రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి

**గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి హర్షం**

**జనగాం :** చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి మం జాతర నిర్వహణ 200 ఏళ్లు పాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గెద్దెల శాశ్వత పునర్నిర్మాణం మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టడం పట్ల గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి హర్షం వ్యక్తం చేసారు. మొత్తం 251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధి గద్దెల విస్తరణకు 101 కోట్లు 4000 టన్నుల గ్రానైట్ తో గద్దెలకు ప్రాంగణ నిర్మాణం 750 మంది కోయ వంశీయుల పేర్ల పేర్లకు సంబంధించిన 7,000 పైగా శిల్పాలు 930 ఏళ్ల కొయ్యల తాళపత్ర గ్రంధాల ఆధారంగా శిల్ప రూపకల్పన 46 స్తంభాలతో 271 చ. మీ విస్తరణలో ప్రకారం 8 స్తంభాలతో వృత్తాకారం గద్దె నిర్మాణం 40 అడుగుల వెడల్పుతో 3 స్వాగత తోరణాలు 30 అడుగుల వెడల్పుతో 5 స్వాగత తోరణాలు 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం బండారి మరి వెదురు వేప ఇప్ప తదితర 12 రకాల పవిత్ర వృక్షాలు 140 రకాల ఆయుర్వేదిక్ మొక్కలు నాటుతున్నారు పూజార్ల సంఘం ఆమోదంతో అన్ని పనులు నాణ్యతలో ఎక్కడ రాజీలేద న్నారు. రోజువారి సమీక్షలు జనవరి 31 వరకు మహా జాతర కోటి మందికి పైగా భక్తులు తరలివచ్చే అంచనా. మేడారం స్థానిక శాసనసభ్యులు మంత్రివర్యులు సీతక్క ప్రభుత్వ సలహాదారుడు వేమనందరెడ్డి గార్లు ప్రత్యేక శ్రద్ధ చూపడం జరిగింది అని అన్నారు...

## నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

**: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట :** నూతన సంవత్సర వేడుకలు నారాయణ పేట జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ. డిసెంబర్ 31 రాత్రి జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై వేడుకలు నిషేధించబడ్డాయని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపవద్దని, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురిచేయవద్దన్నారు. మద్యం దుకాణదారులు నిర్ణీత సమయం వరకే విక్రయాలు చేయాలన్నారు. అర్ధరాత్రి గుంపులు గుంపులుగా తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా స్నేహపూర్వక వాతావరణంలో శుభాకాంక్షలు తెలుపుకోవాలని విద్యార్థులు, యువతకు సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడతాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, షీ టీమ్స్, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తాయని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని, డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయానికి మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## సిద్దిపేట పట్టణ యాదవ యువజన విభాగం అధ్యక్షుడిగా బొల్లవేని మహేష్ యాదవ్ నియామకం



**అగ్నిధారన్యూస్ "(సిద్దిపేట్)** అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం సిద్దిపేట పట్టణ శాఖ అధ్యక్షుడిగా బొల్లవేని మహేష్ యాదవ్ ను నియమించడం జరిగింది. నేడు ఉదయము సిద్దిపేట పట్టణంలోని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచబోయిన శ్రీహరి యాదవ్ గారి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవ జాతి అభివృద్ధి సంక్షేమం కోసం యువతను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసే విధంగా అంకితభావంతో పనిచేసి, జాతి గౌరవం నిలబెట్టాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మామిండ్ల ఐలయ్య యాదవ్ అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు బొల్లు రాము యాదవ్,కుక్కల తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సహకారం అందించాలి

**– ఆర్జీ 3 జీఎంను సన్మానించిన రచ్చపల్లి పాలకవర్గం**



**అగ్నిధార న్యూస్ మంథని :** తమ గ్రామాభివృద్ధికి సింగరేణి సంస్థ ద్వారా సంపూర్ణ సహకారం అందించాలని రచ్చపల్లి గ్రామసర్పంచ్ కనవేన స్వప్న శ్రీనివాస్ ఆర్జీ 3 జీఎం సుధాకర్‌ను కోరారు. మంగళవారం ఆర్జీ 3 జీఎం సుధాకర్, ఓసీపీ 2 పీఓ రాజశేఖర్‌లను రచ్చపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఘన సన్మానం చేశారు. ఈ సందర్బంగా ఆమె గ్రామ సమస్యలను జీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఆనాడు సింగరేణి సంస్థ కోసం తాము సర్వం ధారపోశామని, తమకు ఏర్పాటు చేసిన ఆర్‌అండ్ ఆర్ కాలనీలో పలు సమస్యలు ఉన్నాయన్నారు. సూరయ్యపల్లి నుండి రచ్చ పల్లి ఆర్అండ్ఆర్ కాలనీ వెళ్ళటానికి సరైన రోడ్డు వసతి లేదని, నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారి పూర్తిగా గుంతలమయమై ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ రహదారికి డబుల్ రోడ్డు మంజూరీ చేయాలని, అలాగే కమ్యూనిటీ హాల్ లో డిన్నర్ హాల్ మంజూరు చేయాలని కోరుతూ జీఎంకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుర్రం సృజన సదానందం, వార్డ్ మెంబెర్ గుర్రాల స్వప్న రాంమూర్తి. సింగనవేన కీర్తన కుమార్. జాగిరి భూమేష్. మాజీ వార్డ్ మెంబెర్ కొల్లూరి భాగ్య నాగరాజు. ఆశాడాపు సాయి తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల మ్యాపింగ్ పకడ్బందీగా చేయాలి కలెక్టర్ ఆదర్శ్ సురభి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** త్వరలో జరిగే పురపాలికల ఎన్నికల నిర్వహణకు వార్డుల మ్యాపింగ్ ప్రక్రియను తప్పులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్లో మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనవరి 1న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, జనవరి 5 నుంచి అభ్యంతరాలు స్వీకరించి, జనవరి 10న తుది ఓటరు జాబితా ప్రకటించాలని సూచించారు.వార్డుల మ్యాపింగ్ సక్రమంగా జరిగితే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.




## బాక్సాఫీస్ వద్ద 'మెగా-విక్టరీ' హంగామా..
## 'మన శంకరవరప్రసాద్ గారు' నుంచి మాస్ సాంగ్ రిలీజ్!

రాబోయే సంక్రాంతికి థియేటర్లలో అసలైన పూనకాలు తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి. ఆయన ప్రధాన పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఈ చిత్రంలో వెంకటేష్ ఒక పవర్‌ఫుల్ అతిథి పాత్రలో నటిస్తుండటం విశేషం. ఈ సినిమా విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్ర యూనిట్ 'ఆర్ యూ రెడీ' అనే మాస్ పాటను విడుదల చేసింది. ప్రముఖ గీత రచయిత కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం మాస్ ఆడియన్స్‌ను ఉర్రూతలూగిస్తోంది. "ఏంటి బాసూ సంగతీ.. అదిరిపోద్దీ సంక్రాంతీ.., ఏంటి వెంకీ సంగతీ.. ఇరగతీద్దాం సంక్రాంతీ.." అంటూ సాగే లైన్లు అభిమానుల చేత ఈలలు వేయిస్తున్నాయి. మెగాస్టార్ తన సిగ్నేచర్ స్టెప్పులతో గ్రేస్‌ను చూపిస్తుంటే, వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్ మరియు మేనరిజమ్స్‌తో పాటలో జోష్ నింపారు. పాట చిత్రీకరణలో అనిల్ రావిపూడి తనదైన కలర్‌ఫుల్ అండ్ ఎనర్జిటిక్ మార్క్‌ను చూపించారు. ఈ చిత్రంతో మెగాస్టార్ మరోసారి తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించుకోవడానికి సిద్ధమయ్యారు. వెంకటేష్ తోడవ్వడంతో ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులకు కూడా ఫుల్ మీల్స్ లాంటి విందు అని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## మిక్స్‌డ్ టాక్ నుంచి స్టడీ కలెక్షన్స్ బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకుంటున్న 'ఛాంపియన్'




ఐదు రోజుల క్రితం థియేటర్లలో విడుదలైన 'ఛాంపియన్' సినిమాకు మొదటిరోజు నుంచి ఆహా, ఓహో అనే స్థాయి టాక్ రాలేదు. అయితే "ఓ సారి హ్యాపీగా చూసేయొచ్చు" అనే డీసెంట్ స్పందనతోనే సినిమా ప్రయాణం మొదలైంది. టాక్ ఎలా ఉన్నా, బాక్సాఫీస్ వద్ద మాత్రం ఈ సినిమా తన సత్తా చాటుతోంది. విడుదలైన కొద్ది రోజులలోనే స్టడీ కలెక్షన్లతో వీర విహారం చేస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. నిజానికి ఈ సినిమాపై ముందు నుంచే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీ క్రియేట్ అయింది. అందుకు ప్రధాన కారణం స్వప్న సినిమాస్ బ్యానర్. 'మహానటి', 'జాతిరత్నాలు', 'సీతారామం' వంటి కల్ట్ చిత్రాలు అందించిన ఈ ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తున్న సినిమా కావడంతోనే మొదటి నుంచే సాలిడ్ అంచనాలు ఏర్పడ్డాయి. దీనికి తోడు టీజర్, ట్రైలర్‌లు కూడా సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. రిలీజ్ రోజున మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ, ఆ తర్వాత పరిస్థితి క్రమంగా మారింది. సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి పాజిటివ్ అభిప్రాయాలు వెల్లువెత్తడంతో వర్డ్ ఆఫ్ మౌత్ బలపడింది. అదే ప్రభావం నేరుగా బాక్సాఫీస్ కలెక్షన్లపై పడింది. రోజు గడిచే కొద్దీ థియేటర్లలో ఆక్యుపెన్సీ మెరుగుపడుతూ, సినిమాపై ఆసక్తి పెరుగుతూనే ఉంది. నాలుగు రోజుల పాటు డీసెంట్ వసూళ్లు నమోదు చేస్తూ 'ఛాంపియన్' మంచి బజ్‌ను కొనసాగిస్తోంది. మొదటి రోజు తర్వాత నెమ్మదిగా పుంజుకున్న ఈ సినిమా, రెండో రోజు నుంచి స్టడీ కలెక్షన్లు రాబట్టడం విశేషం. ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు యూత్ వర్గాలు థియేటర్లకు రావడం కలెక్షన్లకు బలంగా మారింది. కథలోని ఎమోషన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. మేకర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం, 'ఛాంపియన్' సినిమా ఐదు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.12.51 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. షేర్ పరంగా చూస్తే రూ.7 కోట్ల వరకు రాబట్టింది. ఈ సినిమా క్లీన్ హిట్ కావాలంటే ఇంకా సుమారు రూ.4 కోట్ల షేర్ కలెక్ట్ చేయాల్సి ఉంది. టాక్ మరింత పాజిటివ్‌గా కొనసాగితే, వీక్‌డేస్‌లో కూడా స్టడీ కలెక్షన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదే ఊపు కొనసాగితే, 'ఛాంపియన్' సేఫ్ జోన్‌లోకి వెళ్లడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




## బిగ్గెస్ట్ డిజాస్టర్ చిత్రంగా 'వృషభ'..
## నష్టం ఎన్నికోట్లు అంటే..

మలయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్‌కు ఈ ఏడాది బాగా కలిసొచ్చిందనుకుంటే.. తాజాగా విడుదలైన 'వృషభ' మూవీ తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచింది. 2025 మోహన్‌లాల్ నటించిన లూసిఫర్ (ఎంపురాన్) రూ. 268 కోట్లు, తుడరమ్ రూ. 235 కోట్లు, హృదయపూర్వం రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరాయి. కానీ, ఈ ఏడాది చివరలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'వృషభ' భారీ నష్టాలను మిగిల్చింది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదలైన 'వృషభ' మూవీ బాక్సాఫీస్ వద్ద 5రోజుల్లో రూ. 1.94 కోట్లు మాత్రమే వసూలు చేసింది. సుమారు రూ. 70 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీ దారుణమైన ఫలితాన్ని అందుకుంది. ఈ ఏడాది బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా ఈ సినిమా ఉంది. ప్రాంతాల వారిగా 5రోజుల కలెక్షన్స్ ఇలా ఉన్నాయి. ఓవర్సీస్‌లో ఈ చిత్రం దాదాపు రూ. 25 లక్షలు, మలయాళంలో రూ. 1.01 కోట్లు, హిందీలో రూ. 8 లక్షలు, తెలుగు వెర్షన్ రూ. 32 లక్షలు, కన్నడ వెర్షన్ దాదాపు రూ. 4 లక్షలు మాత్రమే సాధించింది. ఫైనల్‌గా ఈ మూవీ రూ. 65 కోట్లకు పైగానే నష్టాన్ని మిగల్చడం ఖాయంగానే కనిపిస్తుంది. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో దర్శకుడు నందకిషోర్ 'వృషభ' చిత్రాన్ని తెరకెక్కించారు. తండ్రీ కొడుకుల చుట్టూ తిరిగే జన్మజన్మల కథగా ఈ మూవీ ఉంది. కొత్తదనం లేని కథతో ప్రేక్షకులకు విసుగు తెప్పించారని విమర్శలు ఉన్నాయి. ఇందులో కేవలం మోహన్‌లాల్ నటన మాత్రమే బాగుందని ప్రశంసలు వచ్చాయి. అజయ్, అలీ, అయ్యప్ప పి.శర్మ వంటి తెలుగునటులు ఈ మూవీలో కీలక పాత్రల్లో కనిపిస్తారు.

## స్టార్ దర్శకుడితో 'కమల్ హాసన్' సినిమా.. జరిగేపనేనా..?



సినిమా రంగంలో ఏదైనా జరగవచ్చు. ఎవరు ఎవరినైనా దర్శకత్వం వహించవచ్చు. అయితే కథే ఇక్కడ ప్రధానాంశం. అది సరిగా సెట్ కాకపోవడంతోనే రజనీకాంత్ హీరోగా సుందర్.సి దర్శకత్వం వహించాల్సిన చిత్రం తెర రూపం దాల్చలేదు. తాజాగా ఒక రేర్ కాంబో గురించి వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అదేంటంటే కమలహాసన్ హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో చిత్రం రూపొందే విషయమై చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం ఉంది. కమలహాసన్ ఏ తరహా చిత్రాన్నైనా చేయగలరు. అయితే వెట్రిమారన్‌కు ఒక ముద్ర ఉంది. ఆయన చిత్రాల కథలు వెనుకబడ్డ వర్గాల ఇతి వృత్తం, నేరారోపణలకు బలైన యువత ఇతి వృత్తంతో ఉంటాయి. తాజాగా ఈయన శింబు హీరోగా అరసన్ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఉత్తర చెన్నైకి చెందిన గ్యాంగ్‌స్టర్స్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని కలైపులి ఎస్.థాను తన వి.క్రియేషన్ పతాకంపై నిర్మిస్తున్నారు. అదే విధంగా నటుడు కమలహాసన్ తాజాగా స్టంట్‌మాస్టర్ల ద్వయం అన్బరివ్‌ల దర్శతకత్వంలో నటిస్తూ, తన రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషన్ పతాకంపై నిర్మించే పనిలో బిజీగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వెట్రిమారన్ దర్శకత్వంలో కమలహాసన్ హీరోగా నటించే చిత్రం గురించి చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇందులో నిజమెంతోగానీ, ఇదే గనుక జరిగితే కచ్చితంగా వైవిధ్యభరిత కథా చిత్రం అవుతుంది.

## డ్రాగన్ కంట కన్నీరు..
## సల్మాన్ ఖాన్ గల్వాన్ మూవీపై చైనా మీడియా అక్కసు!

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' టీజర్ విడుదలైనప్పటి నుంచీ సరిహద్దు అవతల చైనాలో ప్రకంపనలు మొదలయ్యాయి. డిసెంబర్ 27న సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ టీజర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తుండటంతో, చైనా అధికారిక పత్రిక 'గ్లోబల్ టైమ్స్' ఈ సినిమాపై అక్కసు వెళ్లగక్కింది. భారత సైనికుల వీరత్వాన్ని చాటిచెప్పే ఈ చిత్రాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో చైనా మీడియా తన సంపాదకీయంలో పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్ వాస్తవ సంఘటనల ఆధారంగా తీసిన సినిమా కాదని, కేవలం భారతీయుల్లో జాతీయవాదాన్ని రెచ్చగొట్టడానికి రూపొందించిన నేషనలిస్టిక్ మెలోడ్రామా అని చైనా కొట్టిపారేసింది. అంతేగాకుండా 2020 గల్వాన్ ఘర్షణల్లో భారత సైనికులే చొరబాటుకు పాల్పడ్డారని బుకాయిస్తూ.. సినిమాలో తమ సైన్యాన్ని విలన్లుగా చూపించడం సరికాదని చైనా వాదిస్తోంది. అలాగే అంతర్జాతీయ వేదికలపై చైనా సైనికుల మరణాల సంఖ్య గురించి భారత్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని గ్లోబల్ టైమ్స్ ఆరోపించింది.




Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com